నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

మెదక్

సోమవారం | 28 అక్టోబర్ 2024 | www.navatelangana.com

మల్లన్నను దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ-కొమురవెల్లి

రాష్ట్ర దేవాదాయ దర్మాదాయ, అటవీ పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ ఆదివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వర్గాలు ఆమెకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు స్వామి వారి చిత్రపటం అందజేయగా, అర్చకులు మంత్రికి తీర్ధ ప్రసాదాలు, స్వామి వారి శేష వస్త్రాములు అందించి వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఉద్యోగులకు రిటైర్మెంట్ డబ్బులు చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం

మాజీ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్ అయిన 6000 మంది ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ డబ్బులు చెల్లించడం లేదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ మూడు సంవత్సరాల తర్వాతే చెల్లిస్తామనడం దుర్మార్గమని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన మన్మోహన్ వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యతిథిగా హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. ఒక డీఏ మాత్రమే ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగులను నిరాశపరిచారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15 డీఏలను ఉద్యోగులకు ఇచ్చామన్నారు. పదవీ విరమణ పొందిన మన్మోహన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 1కె రన్



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 1కె రన్ నిర్వహించారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక స్టేడియం గ్రౌండ్ నుంచిఅంబేద్కర్ విగ్రహం మీదుగా ఈ రన్ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శిలు డాక్టర్ కె.అనంతరెడ్డి, ఆకుల రాంబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల మానయ్య, లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షులు అల్లే శ్రీకాంత్, కోశాధికారి జి. సంతోష్, మండల విద్యాధికారి బండి కృష్ణ, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, లెక్చరర్లు ఉపాధ్యాయులు వెంకటేశం, విట్టల్, త్రినాధరావు, నవీన్, కుమారస్వామి, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ట్రామా సెంటర్ల ఏర్పాటుకు చర్యలు

- రాజకీయాలకు అతీతంగా పేదలకు ఇండ్ల మంజూరు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- జోగిపేట మార్కెట్ కమిటీ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు

నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్రం వ్యాప్తంగా ట్రామా సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని.. అత్యవసర పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే సంఘటనా స్థలం నుంచి గంటలోపు హాస్పిటల్‌కు ప్రమాద బాధితులకు చేరవేసి చికిత్స అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. జోగుపేట శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ 30 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామా సెంటర్ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో సంగారెడ్డి, కంకోల్, జోగిపేట, వట్‌పల్లి, అల్లాదుర్గ్ ప్రాంతాల్లో ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు.

క్యాబినేట్ మీటింగులో పేదలకు ఇండ్లు, ఇల్ల స్థలాలు అందించే విషయంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి సమ ప్రాతిపదికన ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అందోల్‌కు 3500 ఇండ్లు రానున్నాయన్నారు. పేదలకు అందించే ఇండ్ల విషయంలో రాజకీయాలకు తావులేదన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు ఇండ్లు మంజూరు చేసే విధంగా క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతనే నిజమైన లబ్దిదారుల ఎంపిక చేయన న్నట్టు తెలిపారు. అభివృద్ధి విషయంలో ప్రాంతీయ ప్రీతి సహజమన్నారు. నా కుటుంబం, నా ఊరు, నా మండలం, నా నియోజకవర్గం నా ప్రాంతం, అభివృద్ధి చెందాలనే ఆశ సహజంగానే ఉంటుందని.. మనిషి ఆశా జీవి అని ప్రాంత అభివృద్ధి కాంక్ష అందరికీ ఉండాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఏరియా ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల, జెఎన్టియూ యూనివర్సిటీ, పీజీ కలాశాల, వట్‌పల్లి మండలానికి 50 పడకల ఆసుపత్రి జోగిపేటకు నాలుగు లైన్ల రోడ్డు, జోగిపేట వ్యాపార వృద్ధి జరిగేందుకుకు మంజీర నది అవతల ఉన్న గ్రామాలను జో గిపేటతో అనుసందానించేందుకు అజ్జమర్రి బ్రిడ్జి, పాలి టెక్నిక్ కలాశాల ఇలా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన ట్లు తెలిపారు. ఎవరూ అడగకపోయినా నియోజకవర్గ అభి వృద్ధికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పన దిశగా ఆలోచన తన మదిలో నిరంతరం ఉంటుందన్నారు. అందోల్ నియోజకవర్గంలో 38700 మందికి రుణమాఫీ జరిగిందని.. రాబోయే రోజుల్లో సుమారు 2000



కుటుం బా లకు రుణమాఫీ జరుగనుందన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజ య్య, జోగిపేట మార్కెట్ చైర్మన్ ఎం.జగన్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ పద్మనాభ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, మం డల కాంగ్రెస్ అధ్యక్షులు శివరాజ్, రమేష్, దశరథ్, శేషారెడ్డి, కిషన్, దిగంబరావ్, కౌన్సిలర్లుసురేందర్ గౌడ్, చిట్టిబాబు, చందర్, హరికృష్ణగౌడ్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్ సాధించిన విద్యార్థికి సన్మానం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణం భాగరెడ్డిపల్లికి చెందిన రైల్వే ఉద్యోగి రవి కూతురు హనీ ఎంబీబీఎస్ సీట్ సాధించడంతో.. రవి కుటుంబ సభ్యులకు, కూతురు హనీకి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడు తూ.. సరైన వైద్యం అందక అనేక మంది నిరుపేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని.. అలాంటి వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రవి, ఆయుధాల రామచందర్, జయరాజ్, పోలీస్ ఆనంద్, రాజు గిర్ని, చిన్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రాములు నేత, వై.తులసి దాస్ గుప్తా, జి.విజయ్ కుమార్, నేత సాగర్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా ఉద్యమాల సారథి సీపీఐఎం

- సీపీఐ(ఎం) సిద్దిపేట సిద్దిపేట జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్‌గా చుక్క రాములు

నవతెలంగాణ-గజ్వేల్

ప్రజా ఉద్యమాలకు సీపీఐ (ఎం) ఉద్యమ సారథిగా పని చేస్తుందని సిద్దిపేట జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములు అన్నారు. ఆదివారం సీపీఐ (ఎం) సిద్దిపేట జిల్లా మూడో మహాసభలు డిసెంబర్ 1, 2 తేదీల్లో గజ్వేల్ పట్టణంలో నిర్వహించనున్నట్లు సీపీఐ (ఎం) ఆదివారం గజ్వేల్ పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఎర్రజెండా దేశవ్యాప్తంగా భూ ఉద్యమాలు, రైతాంగ, కార్మిక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచడం జరిగిందన్నారు. నేడు అమెరికాకు దీటుగా చైనా రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. ఫ్రాన్స్‌లో కమ్యూనిస్టు బలం పెరిగిందని, శ్రీలంకలో మార్క్సిస్ట్ మేధావి అధ్యక్షుడయ్యారన్నారు. అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీ బలంగా విస్తరిస్తుందన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో సిపిఎం పార్టీ బలంగా ఉందని ప్రజా ఉద్యమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దేశంలో జరిగిన రైతాంగం పోరాటంకు వెన్నుదన్నుగా సీపీఐ(ఎం) నిలబడిందన్నారు. పోరాట ఫలితంగా రైతు వ్యతిరేక చట్టాలు వెనక్కు తీసుకొని, ప్రజలకు క్షమాపణ చెప్పారన్నారు. కార్మిక సమ్మెలు పోరాటాలు నిర్వహిస్తూ కార్మిక వర్గంకు రక్షణగా నిలబడిందని తెలిపారు. ప్రభుత్వ రంగం రక్షణ కోసం ప్రైవేటీకరణ వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిందని కార్మికుల ఉద్యోగులకు రైతులకు వ్యవసాయ కార్మికులకు అండగా ఎర్రజెండా నిలబడిందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో మల్లన్న సాగర్ ముంపు బాధితుల కోసం యాత్రలు నిర్వహించి గ్రామసభలు పెట్టిందన్నారు. సీపీఐ (ఎం) పోరాట ఫలితంగా ప్యాకేజీలు పెరిగాయన్నారు. కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని వేతనాలు పెంచాలని చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని సీపీఐ (ఎం) ఉద్యమించిందని తెలిపారు. ధరణి సమస్యలపై, హమాలీ భవన నిర్మాణం, గ్రామపంచాయతీ,ట్రాన్స్పోర్ట్ కార్మికుల రక్షణ కోసం సమగ్ర భీమా చట్టం అమలు చేయాలని ఉద్యమించిన్నారు. ఎర్రజెండా అంటే కార్మికుల జెండా అని పేదలకు అండ అని భూమి కోసం ఇళ్లస్థలాల కోసం ఉద్యమించిందన్నారు. సీపీఐ(ఎం) పార్టీ మూడో మహాసభలను రైతాంగం, కార్మికులు ప్రజలు ఆదరించాలని పోరాటాలను బలపరచాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు



సందబోయిన ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్య కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి. శశిధర్, భాస్కర్, సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శారద, మావో రవి, యాదగిరి, శిరీష, కృష్ణారెడ్డి, సీపీఐ(ఎం) గజ్వేల్ నాయకులు రంగారెడ్డి, బండ్ల స్వామి, వెంకట చారి, కనుకయ్య, మహేందర్ రెడ్డి, ప్రవీణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టా జూనియర్ కళాశాలలో ఘనంగా క్రీడోత్సవాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని ఇష్టా జూనియర్ కళాశాలలో ఆదివారం క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇష్టా జూనియర్ కళాశాల డైరెక్టర్ వినోద్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ రవి కిరణ్‌రెడ్డి, అకడమిక్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, వైస్ ప్రిన్సిపల్ ఇబ్రహీం, కళాశాల అధ్యాపకుల బృందం హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో క్రీడల ప్రాముఖ్య తను వివరించారు. ప్రస్తుతకాలంలో విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించడానికి శారీరక క్రీడలు అత్యంత అవసరమన్నారు. పీఈటీలు వెంకట్ రెడ్డి, కళ్యాణ్, నరేష్, కృష్ణవేణి వారి ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, షార్ట్‌పుట్, వాలీబాల్, థాగ్ ఆఫ్ వార్ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబరుస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

పత్తిలో గంజాయి సాగు

- అంతర పంటగా సాగు చేసిన ఇద్దరు రైతులు
- నమ్మదగిన సమాచారంతో ఎక్సైజ్, పోలీసుల దాడి
- మూడు లక్షలు విలువ చేసే మొక్కలు స్వాధీనం... ధ్వంసం





నవతెలంగాణ-వట్‌పల్లి

ఇద్దరు రైతులు పత్తిలో అంతరపంటగా సాగు చేసిన మూడు లక్షలు విలువ చేసే గంజాయి మొక్కలను ఎక్సైజ్, పోలీసు సిబ్బంది సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల పరిధిలోని నిర్జప్ల గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే..

గ్రామానికి చెందిన కొందరు గంజాయి మొక్కలు పెంచుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో జోగిపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాగర్ రెడ్డి, ఎస్సైలు విజయ్ కుమార్, సందీప్‌లు సిబ్బందితో కలిసి నిర్జప్ల గ్రామంలో దాడులు చేశారు. గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రయ్య తన ఇంటి వెనుక గల ఖాళీ స్థలంలో పెంచుతున్న ఎనిమిది గంజాయి మొక్కలను.. అదేవిధంగా గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో పత్తిలో అంతర పంటగా సాగు చేస్తున్న 28 గంజాయి మొక్కలను వారు ధ్వంసం చేశారు. పత్తి చేనులోని ఈ మొక్కలు ఒక్కోటి రెండు గజాలకంటే పైనే పెరగడం గమనార్హం. వాటి విలువ రెండు లక్షల వరకు ఉండవచ్చని ఎక్సైజ్, పోలీసు అధికారులు తెలిపారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన పెద్దగుండ్ల మొగులయ్య తన వ్యవసాయ పొలం వద్ద పత్తిలో అంతం పంటగా సాగు చేసిన మూడు గజాల వరకు పెరిగిన 11 గంజాయి మొక్కలను పట్టుకుని ధ్వంసం చేశారు. వాటి విలువ సుమారు లక్ష పైబడి ఉండి ఉంటుందని అధికారులు తెలిపారు. ఒకే రోజు ఒకే గ్రామంలో ఇద్దరి రైతుల పొలాల వద్ద అధికారులు దాడులు చేయడంతో.. గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మొన్న ఉసిరికపల్లి, నిన్న నిర్జప్ల, మరి నేడు ఏ గ్రామంలో దాడులు జరుగుతాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కాగా ఇద్దరు నిందితులపై కేసులు నమోదు చేసి.. త్వరలోనే వారిని పట్టుకుంటామని సీఐ, ఎస్సైలు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది సాయిలు, విక్రమ్, ముఖీమ్, వెంకటేష్ చౌదరి, సెక్రటరీలు జయంతి, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఆదివారం 127 మందికి రూ.28.65 లక్షల ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రబీకి, యాసంగికి రైతు బందు ఇచ్చారని, కానీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మూడుసార్లు రైతుబందు ఇవ్వాలని కాంగ్రెస్ వారు డిమాండ్ చేశారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రైతుబందు ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. ఆడపడచులకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తామని ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. కళ్యాణ లక్ష్మీకి తులం బంగారం కలిపి ఇస్తామన్నారనీ, తులం బంగారం దేవుడెరుగు కల్యాణ లక్ష్మి కూడా ఇవ్వట్లేదన్నారు. ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టిందన్నారు. నిరుద్యోగ యువతకు ఏడాదిలోపు లక్ష ఉద్యోగాలు ఇస్తామన్నారని, అధికారంలోకి వచ్చి 11 నెలలు కావొస్తుందని, కానీ 25000 ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. పీఆర్సీ ఇస్తామన్నారని, దాన్ని కూడా ఇవ్వలేదన్నారు. పేదొడికి ఇళ్ల ఇవ్వకుండా, ఉన్న ఇండ్లను కూడా కూలగొడుతున్నారన్నారు. తెలంగాణ అక్కచెల్లెల్లకు 2500 ఇస్తామని బాండ్ పేపర్ కూడా రాసిచ్చారని, కానీ దాని ఊసే లేదన్నారు. కేసీఆర్ హయాంలో సర్కార్ దవాఖానలో ఆడపిల్ల పుడితే రూ.13వేలు ఇచ్చి, కేసీఆర్ కిట్ ఇచ్చి, తల్లిబిడ్డను క్షేమంగా ఇంటివద్ద దింపుతుండేనని, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.13వేలు గాని, కేసీఆర్ కిట్ గాని ఇవ్వట్లేదన్నారు. ప్రజలను మాయమాటలతో నమ్మించారని, ప్రజలు నమ్మి ఓటేస్తే గొంతుకోస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు ఫారుక్ హుస్సేన్, రాజనర్సు, రవీందర్ రెడ్డి, మోయిజ్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా డప్పు శంకర్ ఎన్నిక



నవతెలంగాణ-చౌటకూర్

చౌటకూర్ గ్రామానికి చెందిన డప్పుశంకర్ అందో ల్-జోగిపేట మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గంలో (డైరెక్టర్) మెంబర్‌గా ఎన్నిక య్యారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదన రాజనర్సింహా సమక్షంలో ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన తర్వాత శంకర్ మాట్లాడు తూ.. తనకు మంత్రి చొరవతోనే ఈ అవకాశం దొరికిందని ఆనందం వ్యక్తం చేశారు. వార్డు మెంబర్‌గా ఉన్న తనను పార్టీ గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే చౌటకూర్ మండ లం నుంచి ఎన్నుకోవడానికి కృషి చేసిన మండల అధ్యక్షులు నత్తి దశరథ్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థులకు మంత్రి పరామర్శ

మెరుగైన వైద్య సదుపాయం అందించాలి

అవసరమైతే ప్రైవేట్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందించాలని ఆదేశాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

అస్వస్థతకు గురై సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న న్యాల్కల్ కస్తూర్బా గురుకుల విద్యార్థులను రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి దామోదర్ రాజానర్సింహా ఆదివారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులకుఆదేశాలు జారీ చేశారు. త్వరగా కోలుకుంటారని విద్యార్థులకు ధైర్యం నింపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. అధైర్యపడవద్దని, పిల్లలకు ధైర్యం చెప్పాలని అవసరమైతే ప్రైవేట్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సౌకర్యం కల్పిస్తామని భరోసా కల్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, విద్యార్థుల పరిస్థితిని మంత్రికి వివరించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాసవి క్లబ్ రీజియన్ కాన్ఫరెన్స్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డిలో స్థానిక విద్యానగర్ కమ్యూనిటీ హాల్లో వాసవి క్లబ్ 6 రీజియన్ కాన్ఫరెన్స్ నామ భాస్కర్ పద్మ దీపోత్సవం పేరుతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ రీజియన్ కాన్ఫరెన్స్‌కి ముఖ్య అతిథిగా కటకం హరీష్ బాబు హాజరై మాట్లాడారు. ప్రతి సంవత్సరం వాసవి క్లబ్ ద్వారా రూ.30 కోట్ల పైన సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. రీజియన్ పరిధిలో 10 క్లబ్‌లకు అవార్డులు అందజేశారు. గెస్ట్ ఆఫ్ ఆనర్లుగా తోపాజి అనంత కిషన్, చందా శ్రీధర్, పుల్లూరి ప్రకాష్, మా శెట్టి ఉపేంద్ర, వంకమామిడి రాజేందర్, సుధారాణి, గవర్నర్ భానూరి నరసింహులు డిస్ట్రిక్ట్ సెక్రటరీ బొజ్జ మురళీధర్, జిల్లా కోశాధికారి మనోజ్ కుమార్ వైస్ గవర్నర్ ప్రదీప్ కుమార్‌లతో పాటు రీజియన్ కాన్ఫరెన్స్లో డిస్టిక్ ఇన్చార్జిలు కొంపల్లి విద్యాసాగర్, కటకం శ్రీనివాస్ వనం నరేందర్, చిలమకూరి నరేంద్ర, నామ శ్రీనివాస్ కాన్ఫరెన్స్ అబ్జర్వర్‌గా బచ్చు మహేష్, అల్లంకి విజయభాస్కర్, జోన్ చైర్మన్లు పుట్నాల లక్ష్మణ్, శారద ఇంకా వాసవి క్లబ్ వనితా క్లబ్ యూత్ క్లబ్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు కోశాధికారులు పాల్గొన్నారు.

పాత కక్షలతో రాడ్లు, కర్రలతో ఇద్దరు వ్యక్తులపై దాడి

- ఇద్దరికీ తీవ్ర గాయాలు

ఏసీపీ ఆధ్వర్యంలో పోలీస్ పికెటింగ్



నవతెలంగాణ-మద్దూరు

తనకన్నా చిన్నవాడు పెద్దమనుషుల సమక్షంలో తనను కొట్టాడని కక్ష పెట్టుకున్న కొందరు. కాపుగాసి ఇద్దరు వ్యక్తులపై రాడ్లు, కర్రలతో. దాడి చేసి గాయపరిచిన సంఘటన మద్దూరు మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్, తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిలుక సతీష్, దామెర విజయ్‌లపై పాత కక్షలు మనసులో పెట్టుకున్న అదే గ్రామానికి చెందిన చిలక లక్ష్మణ్, రాజు, రాంబాబు, పరుశరాములు, ప్రేమ్ కుమార్, మురళి, బాబు, మురళిలు రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో సతీష్, విజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సతీష్ తండ్రి దశరథ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు. పాత కక్షలతో ఇద్దరు వ్యక్తులను గాయపర్చిన ఘటనతో గ్రామంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్ ఆధ్వర్యంలో ముందస్తుగా ఎస్సీ కాలనీలో పోలీస్ పికెటింగ్ నిర్వహించారు.



వైకుంఠ దామంలో సిమెంట్ బెంచీల ఏర్పాటు



నవతెలంగాణ-తూప్రాన్ : మానవత్వం చాటి ప్రజల సౌకర్యార్థం వైకుంఠ థామంలో కూర్చోవడానికి దాదాపు రూ.25 వేలను ఖర్చు చేసి సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. పట్టణం శివారులో పెద్ద చెరువు ఏనే కట్టపై నిర్మించిన వైకుంఠ థామంలో మానవత్వంతో మున్సిపల్ 15వ వార్డ్ కౌన్సిలర్ రామునిగారి శ్రీశైలంగౌడ్ ఉదారతతో ఆదివారం ఈ బెంచీలను ఏర్పాటు చేశారు. అతని తల్లిదండ్రులు స్వర్గీయ రామునిగారి రామకిష్టయ్య గౌడ్, రాజమనిలతో వారి వంశస్థుల జ్ఞాపకార్థం ఈ సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

దీపావలి లోపు కార్మికులందరికీ బోనస్ చెల్లించాలి

చెల్లించని పరిశ్రమల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య



నవతెలంగాణ-గుమ్మడిదల

పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ దీపావలి పండుగలోపు బోనస్ చెల్లించాలని.. ఒకవేళ అప్పటికీ చెల్లించకుంటే చెల్లించని పరిశ్రమల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య హెచ్చరించారు. ఆదివారం గుమ్మడిదల వచ్చిన సందర్భంగా కార్మికుల విషయమై మాట్లాడుతూ.. 1965 బోనస్ చట్ట ప్రకారం కార్మికులందరికీ బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్, క్యాజువల్, ఫిక్స్‌డ్, కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఖచ్చితంగా బోనస్ చెల్లించాలని చట్టం చెబుతున్నద న్నారు. ఏడాదిలో 30 రోజులు పని చేస్తే చాలన్నారు. కానీ జిల్లాలో చాలా పరిశ్రమల్లో బోనస్ ఎగ్గొట్టడం కోసం యజమానులు కుట్రలు చేస్తున్నార న్నారు. బోనస్ చెల్లించడానికి లాభ నష్టాలకు సంబంధం లేదన్నారు. కనీసం బోనస్ చెల్లించకుండా కాలయాపన చేయడం దుర్మార్గమన్నారు. దేశంలోనే పెద్ద పండుగలైన దీపావళి, దసరా సమయంలో కూడా బోనస్ చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎక్కడైనా బోనస్ చెల్లించకపోతే సీఐటీయూ నాయకులను సంప్రదించాలని కోరారు. బోనస్ చెల్లించకపోతే దీపావళి తర్వాత పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

హాస్టల్ విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సంగారెడ్డి



అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న న్యాల్కల్ మండలం కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే చింత ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్ ఆదివారం పరామర్శించారు.విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఎమ్మెల్యే ఆదేశించారు. అధైర్యపడొద్దని విద్యార్థులకు, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అధించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట సీడీసీ మాజీ చైర్మెన్ బుచ్చిరెడ్డి, పట్టణాధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, డా.శ్రీహరి, పార్టీ ఝురాసంఘం మండలాధ్యక్షులు వెంకటేశం, నరసింహగౌడ్, మాజీ జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, రాజేందర్ నాయక్ తదితరులున్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి



న్యాల్కల్ కస్తూర్బా పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి.. కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదివారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిని సందర్శించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర ఆదేశించడంతో.. కలెక్టర్ ఆసుపత్రిని సందర్శించివిద్యార్థుల పరిస్థితిపై వైద్యులతో సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించా లని ఆదేశించారు. పరిస్థితి విషమంగా ఉన్న విద్యార్థులను వెంటనే మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలా ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



పలు శుభకార్యాల్లో పాల్గొన్న ఎంపీ, ప్రముఖులు

నవతెలంగాణ-న్యాల్‌కల్

ముంగి ఎస్ఎల్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన గుంజేటి గ్రామానికి చెందిన జగన్, శిరీష చిన్నారి పుట్టినరోజు వేడుకల్లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, పలు పార్టీల ముఖ్య నాయకులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమంలో జరిగిన గుంజేటి గ్రామానికి చెందిన సాంబశివుడు కుమారుడు వివాహ వేడుకకు కాంగ్రెస్ ముఖ్య నాయకులు నాగేశ్ షెట్కర్, టీజీ ఐడీసీ మాజీ చైర్మెన్ తన్వీర్‌తో కలిసి ఎంపీ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ జెడ్పీ టీసీ గుంజేటి చంద్రప్ప, మాజీ వైస్ఎంపీపీ గౌసోద్దీన్, సిద్ధిలింగయ్య స్వామి, విశ్వనాథ్,శివకుమార్, శివరాజ్‌పాటిల్, వీరన్న పటేల్, సదానంద్ తదితరులున్నారు.

ఆచార్య డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో ఆచార్య డిగ్రీ కళాశాల జహీరాబాద్ ఆవరణంలో నేడు(సోమవారం) టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో ఎంఎస్ఎస్ లాబరేటరీలో ఉద్యోగాల కల్పనకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతల హరికుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌కి ప్రస్తుతం డిగ్రీ ఎంపీసీ, బీజెడ్‌సి తృతీయ సంవత్సరం విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వారి రెజ్యూమ్, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఆచార్య డిగ్రీ కళాశాలకి ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. ఈ డ్రైవ్ ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అన్ని కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



అధ్వానంగా వావిలాల చెరువు కట్ట రోడ్డు

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని వావిలాల చెరువుకట్ట రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు మొత్తం గుంతలమయంగా ఉండడంతో స్థానికులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాదారుల పరిస్థితి మరి దారుణంగా మారిందని వాపోతున్నారు. ఈ గుంతల రోడ్డులో ఎప్పుడు ఈ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని నెలకొన్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం, వావిలాల సెక్రటరీ స్పందించి వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరతున్నారు.



ఐవిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు అందజేత

నవతెలంగాణ-హత్నూర

మండల పరిధిలోని కాసాల గ్రామానికి చెందిన దండు శంకర్, పద్మ దంపతుల కూతురు వాణి వివాహానికి ఏవీఆర్ ఫౌండేషన్ చైర్మెన్ శరత్ చంద్ర పుస్తెమెట్టెలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏవీఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేయడం.. పేదింటి వధువు ఆడపడుచులకు తమ పెద్దల జ్ఞాపకార్థం పుస్తె మెట్టెలను అందజేయడం సంతోషంగా ఉన్నదన్నారు. సేవ చేయడంలో ఎంతో తృప్తి ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో చెలిమిటి, భాగయ్య, చెరువుముంగటి లింగేశ్వర్, రాములు, ఏవిఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నీలం వైద్యశాలలో ఎండోస్కోపీ సేవలు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని నీలం వైద్యశాలలో ఎండోస్కోపీ సేవలను కూడా నిర్వహిస్తున్నట్టు వైద్యశాల నిర్వాహకులు మహమ్మద్ ఆయాజ్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ సేవలు కొనసాగుతాయ న్నారు. ఎండోస్కోపీ చేసుకునేవారు వారు పరిగడుపున వైద్యశాలకు రావాలన్నారు. కడుపునొప్పి, గుండెలో మంట, మింగడానికి ఇబ్బంది కడుపు ఉబ్బరంగా ఉండడం, మలం నల్లగా రావడం లాంటి సమస్యలు ఉన్న వారు వైద్యులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. అతి తక్కువ ధరలకే మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.



ప్రమాదకరంగా రోడ్డుకిరువైపుల చెట్లపొదలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

రేజింతల్-ఎల్గోయి గ్రామాల మధ్య గల ఆర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా చెట్ల పొదలు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. నిత్యం ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఈ గ్రామాల మీదుగా రాకపోకలు సాగుస్తుంటారు. అయితే చెట్ల పొదలు పెరిగి రోడ్డు సరిగా కనిపించకపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా సూచిక బోర్డులు లేకపోవడంతో కొత్తగా ఈ దారులగుండా వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

కుల వృత్తులకు చేయూతేదీ?

- విద్యుత్ మోతలతో భారంగా మారుతున్న పనులు
- కుటుంబ పోషణ కూడా కష్టమవుతున్నది
- ప్రభుత్వమే ఆదుకోవాలి
- కులవృత్తిదారుల వేడుకోలు

నవతెలంగాణ-మునిపల్లి



రాష్ట్రంలో కులవృత్తులను ప్రోత్సహించడం కోసం.. వెనుకబడిన కులాల అభివృద్ధికి, వెనుకబడిన చేతి వృత్తులు, కులవృత్తుల వారికి అండగా నిలిచేందుకు గత ప్రభుత్వం కొన్ని ప్రయత్నాలు చేసింది. వృత్తులను బలోపేతం చేయడానికి పలు పథకాలను అమలు చేసింది. ఆ నేపథ్యంలోనే నాయీబ్రాహ్మణులు నిర్వహిస్తున్న హెయిర్‌కటింగ్ సెలూన్లు, రజకులు నిర్వహిస్తున్న లాండ్రీ షాపులు లేదా ధోబీ ఘాట్లకు నెలకు 250 యూనిట్ల కరెంట్‌ను ఉచితంగా సరఫరా చేసే పథకాన్ని అమలు చేస్తూ ప్రకటన చేసింది. ఈ వృత్తిలో కొనసాగుతున్న వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా, వారికి చేయూతనివ్వడానికి ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకం ప్రకటనకే పరిమితమైంది. ఆ పథకం లబ్ధి రావట్లేని నాయీబ్రాహ్మణులు, నాయిని బ్రహ్మ సంఘాల వారు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత వెనుకబడిన కులాలుగా గుర్తింపు పొందిన రెండు సామాజిక వర్గాలు ఈ పథకంతో ఎంతో లబ్ధి పొందుత ఎన్నాయని గత ప్రభుత్వం ప్రకటిం చినప్పటికీ.. ఇవి మాత్రమే ప్రకటనలుగా మిగిలిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికైనా చేతివృత్తిదారులను గుర్తించి గత ప్రభుత్వం ప్రకటించిన విధంగా 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరుతున్నారు.

కరెంట్ బిల్లు కట్టలేని దుస్థితి ఉన్నది



కొన్నేండ్లుగా ఒక చిన్న హెయిం కటింగ్ సెలూను నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. కానీ ఇప్పుడు విద్యుత్ బిల్లు కట్టలేని పరిస్థితి ఉన్నది. నేను కేవలం 29 యూనిట్లు మాత్రమే ఉపయోగిస్తున్నా అందుకు రూ.334 పైగా విద్యుత్ బిల్లు వస్తుంది. ఉచిత విద్యుత్‌ను అందజేయాలి.

-బాల్‌రాజ్, నాయీ బ్రాహ్మణుడు

141 యూనిట్లకు రూ.1700 బిల్ వస్తోంది

గత 20 ఏండ్ల నుంచి నేను హెయిర్‌కటింగ్ సెలూను నడుపుతు న్నాను. అయితే గత ప్రభుత్వం 250 యూనిట్ల కరెంటు ప్రకటించడంతో ఎంతో సంతోషించాను. కాని నెలకు 141యూనిట్ విద్యుత్ మాత్రమే ఉపయోగిస్తే 1700 వందలకు పైగా విద్యుత్ బిల్లు వస్తుంది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

- బస్వరాజ్, నాయీ బ్రాహ్మణుడు

ప్రభుత్వమే ఆదుకోవాలి

కొన్నేండ్లుగా ఈ వృత్తిలోనే ఉన్నాను. ఈ వృత్తి ద్వారానే మా కుటుంబ పోషణ గడుస్తున్నది. ప్రభుత్వ మే మాకు చేయూతనిచ్చి ఆదుకోవాలి.

- మంగలి పవన్, నాయీ బ్రాహ్మణుడు



వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

నవతెలంగాణ-జహీరాబాద్

సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్షులుగా ఇప్పపల్లి నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా కొంక రాజేశ్వర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జహీరాబాద్ పట్టణంలోని బసవ ఫంక్షన్ హాల్‌లో జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఐదుగురు సభ్యులు గల జిల్లా సమాజ్ ఎన్నికల కమిటి వారిని సర్వ సభ్య కమిటీ తీర్మానం మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నికను ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లడుతూ.. జిల్లాలోని సమాజ్ బంధువులకు అండగా వుంటూ, సమాజ్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్ పెద్దలు శివచంద్ర పాటిల్, మల్లికార్జున్ పాటిల్, సుధాకర్, బస్వారాజ్, జహీరాబాద్ సమాజ్ అధ్యక్షులు రాజు షెట్కార్,కార్యదర్శి సుభాష్, సమాజ్ పెద్దలు మడపతి బస్వారాజ్, యంపల్లి నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు

- జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన వ్యాసాలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి



పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీ నుంచి ఏక్తా దివాస్ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి 31వ తేదీ వరకు పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి 'సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగుప రచడంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలను ఆదివారం నిర్వహించినట్టు ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఈ పోటీల్లో ఉత్తమంగా నిలిచిన మూడు వ్యాసాలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగు తుందన్నారు. అదేవిధంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్‌వాడకం, తెలంగాణను డ్రాగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాలపై రాసిన వ్యాసాల్లో ఉత్తమంగా నిలిచిన వ్యాసాలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పూర్తిలో నిర్లక్ష్యమెందుకు?

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్



రైల్వే ఓవర్ బ్రిడ్జీ నిర్మాణం పూర్తి చేయడానికి నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారని.. మంత్రి స్పందించినా పనులు పూర్తి కావా అని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం ప్రశ్నించారు. తన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. రైళ్ల రాకపోకలతో జహీరాబాద్ నియోజకవర్గ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 2019లో రూ.90 కోట్ల అంచనా వ్యయంతో మూడేండ్లలో పూర్తి చేసేలా రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులను రూ.39 కోట్లతో ప్రారంభించారన్నారు. కానీ ఐదేండ్లు గడుస్తున్నా నేటికీ బ్రిడ్జీ నిర్మాణం పూర్తి కాలేదన్నారు. పనులు అసంపూరిగానే మిగిల్చారని.. మరోపక్క సర్వీస్ రోడ్డు దారుణంగా తయారవంతో వాహనదారులు నానా అవస్థలు పడుతు న్నారరన్నారు. వర్షాలు పడితే ఈ రోడ్డు పరిస్థితి మరీ దారు ణంగా ఉంటున్న దన్నారు. అటు బ్రిడ్జి పూర్తి చేయరు.. ఇటు సర్వీస్ రోడ్డును పట్టించుకోరంటూ మండిపడ్డారు. ఇదే విషయమై ఆర్అండ్‌బి అధికారులను సంప్రదించినట్టు గుర్తు చేశారు. కాగాఅంచనా విలువ రూ.90 కోట్లు కాగా బ్రిడ్జీ నిర్మాణ విలువ కేవలం రూ.39 కోట్లే ఉన్నదని.. మిగతా రూ.51 కోట్లు దేనిపై ఖర్చు చేస్తున్నారో అంం కావడం లేదన్నారు. సకాలంలో బ్రిడ్జీని కాంట్రాక్టర్ పూర్తి చేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సుమారు ఏడాది కావస్తున్నా ప్రజల ఇక్కట్లను ఎందుకు అర్థం చేసుకోవడం లేదని మండిపడ్డారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను మంత్రి దామోద రాజ నర్సింహ మున్సిపల్ సమావేశ మందిర సమక్షా సమావేశంలో ఆదేశించి కూడా నెలలు గడుస్తున్నా.. నేటికీ కనీసం ఒక్క అడుగు కూడా పని ముందుకు వెళ్లకపోవడంలో అంతర్యం ఏమిటన్నారు. ఈ ప్రభుత్వ హాయాంలో మంత్రుల మాటకు కూడా విలువ లేకుండా పోతున్న దన్నారు. ఇప్పటికైనా పనులను వేగవంతం చేసి బ్రిడ్జీ పూర్తి చేయాలని.. లేని యెడల ప్రజలందరినీ ఏకం చేసి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు.

పేరుకే క్రీడా ప్రాంగణాలు..

- పిచ్చి మొక్కలతో నిండి ఆటలకు పనికిరాని దుస్థితి
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-సదాశివపేట



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్ననాటినుంచే క్రీడాకారులను ప్రోత్సహించాలనే పేరుతో గత ప్రభుత్వం ఊరూరా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. వాటి కోసం లక్షల రూపాయలు ఖర్చు కూడా చేసింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం కేవలం క్రీడా ప్రాంగణాల బోర్డులు మాత్రమే కనబడుతున్నాయని.. మైదానమంతా పిచ్చిమొక్కలతో నిండి పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో వార్డ్ వార్డుకు ఏర్పాటు చేసుకున్న క్రీడా ప్రాంగణాలకు ప్రభుత్వ బిల్లులు తీసుకున్నారు గానీ.. అందులో ఆట వస్తువులు, వ్యాయామ పరికరాలు, ఒక్కటి ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తున్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వివాహ శుభాకార్యాల్లో పాల్గొన్న తన్వీర్

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణంలోని (ఫ్రెండ్స్) కళ్యాణ మండపంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ యూసుఫ్ కుమారుడి వలిమా వేడుకలో టీఎస్ ఐటీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ పాల్గొని.. వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని పటేల్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బీఆర్ఎస్ నాయకులు కొరేమియా సికందర్ కుమారుడి వలిమా వేడుకలోనూ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ముంగి ఆశ్రమంలో జరిగిన గుంజెట్టి గ్రామస్తులు సాంబశివుడు కుమారుడి వివాహ వేడుకలో పాల్గొని అభినందనలు తెలిపారు. గుంజేటి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్ కుమార్తె జన్మదిన వేడుకల్లో పాల్గొని చిన్నారి కుటుంబ సభ్యులకు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, తిరుమల సేట్, మహమ్మద్ యూసుఫ్, జహంగీర్ అబ్దుల్లా ,మోతిరాం, రాములు నేత, రంగ అరుణ్ కుమార్, మాజీ జడ్పీటీసీ చంద్రప్ప, మాజీ ఎంపీటీసీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శ ఎం.యాదగిరి

నవతెలంగాణ-సంగారెడ్డి



వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు, ఈసీఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్ఆర్డి ఏఎన్ఎంలు ఇతర అన్ని రకాల ఏఎన్ఎంలను యథావిథిగా రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యలో వైద్య ఆరోగ్యశాఖలోని కొంత మందిని రెగ్యులర్ చేయడం హర్షించదగ్గ విషయమే కానీ.. అదే సందర్భంలో మెజార్టీ ఉద్యోగులను విస్మరించడం అత్యంత దుర్మార్గమ న్నారు. ప్రభుత్వం వెంటనే అందరిని బేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య రంగానికి బలమైన ఆయువు పట్టుగా ఉండి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నా.. నేటికీ రెగ్యులర్ కాకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఏఎన్ఎంలు ఏకకాలంలో 36 రకాల రికార్డులు ఆన్ లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైద్య ఆరోగ్య పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళు న్నారన్నారు. గత 23 ఏండ్లుగా పనిచేస్తున్న ఏఎన్ఎంలకు 8,9,10 పిఆర్‌సిల ప్రకారం బేసిక్ పే ఇచ్చారని.. కానీ ప్రస్తుతం తెలంగాణలో తొలి పిఆర్సి బేసిక్ పే ఇవ్వకుండా 30శాతం వేతనాలు పెంచడం వలన ఏఎన్ఎంలు ప్రతినెలా 5 వేల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వారందరిని ఎలాంటి షరతులు లేకుండ యథావిధిగా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

పెద్దకంజర్ల రైతుల భూసేకరణ నిలిపివేయాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

మండలంలోని పెద్దకంజర్ల గ్రామంలోని సర్వేనెంబర్ 120, 121, 125ల్లో గ్రామ రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తున్న బలవంతపు భూసేకరణ కార్యక్రమాన్ని వెంటనే ఆపాలంటూ సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతి పత్రం అందజేశారు. అనంతరం గ్రామ ప్రజలందరూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామ రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు. గ్రామంలో నష్టపోయిన ప్రతీ ఒక్క రైతుకు 2013 చట్టం ప్రకారం 300 గజాల ఇళ్ల స్థలం మరియు 30 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. హెచ్ఎండిఏ అధికారులు రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా బలవంతపు భూసేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నారని.. ఇది సరికాదన్నారు. నష్టపరిహారం ఇచ్చేంతవరకు ఎలాంటి భూసేకరణను చేపట్ట వద్దని, భూసేకరణ ను చేపట్టిన యెడల పెద్ద కంజర్ల గ్రామ రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు వీరగళ్ల జంగయ్య,ముత్యాలు, నర్సింలు,దుర్గయ్య, నాగేష్ నాగభూషణం, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ విట్టల్

నవతెలంగాణ-పట్‌పల్లి



వట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విట్టల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో డిస్టిక్ ట్రైనింగ్ సెంటర్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయన.. బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది సహకారంతో తన వంతు కృషి చేస్తాన న్నారు. చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ సమస్య ఉన్నా పోలీస్ స్టేషన్‌లో తనకు నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. కాగా రెండు నెలలు గా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉండడంతో స్టేషన్‌లో ఉన్న సిబ్బందికి అదనపు బాధ్యత లతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎస్సై నియామకంతో అదనపు బాధ్యతలు తప్పిన ప్పటికీ రైటర్‌ను నియమించకపోవడంతో కేసులను నమోదు చేయడం ఇప్ప టికీ సమస్యగానే ఉన్నది. కేసు నమోదుల కోసం జోగుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించక తప్పడం లేదు. కాగా రైటర్‌ను కూడా నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

సెయింట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంథోనిస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత సాల్మన్ రెడ్డి అధ్యక్షత వహించారు. 2021లో డిగ్రీలో ప్రవేశించి 2024లో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు మెమొంటోస్, సర్టిఫికెట్లతో సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ జవహర్ అకాడమిక్ కౌన్సిలర్‌డాక్టర్ కృష్ణకుమారి,అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌరస్తాలో హైమాక్స్ లైట్లు లేక ఇబ్బంది

నవతెలంగాణ-చౌటకూర్



మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో హైమాక్స్ లైటింగ్ పనిచేయక సుమారు 6 నెలలు గడుస్తున్నది. ఇప్పటి వరకు తాత్కాలిక లైటింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. ఆర్టీసీ బస్సులు కూడా ఇక్కడి నుండే యూటర్న్ చేసుకొని సంగారెడ్డి వెళ్తాయి. కానీ రాత్రి సమయాల్లో సరైన లైటింగ్ లేకపోవడంతో అటు వాహనదారులు ఇటు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుర్గాదేవి విగ్రహ ప్రాణప్రతిష్టలో పాల్గొన్న తన్వీర్

నవతెలంగాణ-కోహిర్



మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలో ఆదివారం జరిగిన దుర్గాదేవి విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో టీజీఐడీసీ మాజీ చైర్మెన్ మొహమ్మద్ తన్విర్ పాల్గొన్నారు. ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండలాధ్యక్షులు లింగారెడ్డి, వెంకట కృష్ణరెడ్డి, సతీష్ గౌడ్, చంద్రప్ప, నియోజకవర్గ నాయకులు బిజీ సందీప్, మధుసూదన్ రెడ్డి, ప్రవీణ్ సాగర్, శ్రీకాంత్, సాయితేజ, దుర్గాభవాని ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
3
మెదక్
సోమవారం | 28 అక్టోబర్ 2024 | www.navatelangana.com

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

- అర్జున్ పిల్లల ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే రోహిత్ రావు

నవతెలంగాణ-మెదక్ టౌన్



ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. మెదక్ పట్టణంలోని ఆజంపుర వీధిలో అర్జున్ ప్రైవేట్ పిల్లల, దంత వైద్యశాలను ఎమ్మెల్యే ప్రారంబించారు. మెదక్ పట్టణ చుట్టుప్రక్కల గ్రామాల నుంచి ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందచేయాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమాన్యం డాక్టర్లు తిరుమలేష్, స్వాతి, స్థానిక కౌన్సిలర్లు మేడి కళ్యాణి, జయశ్రీ, దుర్గాప్రసాద్, నాయకులు మేడి మధుసూధన్, పరశురామ్ గౌడ్, రాగిఅశోక్, హఫీజ్, గూడూరి కృష్ణగౌడ్, గంగాధర్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు..

అడ్డదిడ్డంగా వెళుతున్న మందుబాబులు

నవతెలంగాణ- చిన్నశంకరంపేట



మద్యం కోసం మందుబాబులు అడ్డదిడ్డంగా వాహనాలు తోలుతున్నారు. తోటి వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. చేగుంట నుంచి మెదక్ ప్రధాన రహదారిపై మద్యం దుకాణం ఉండడంతో ప్రయాణికులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని ఒక వైన్స్ ముందర గల ప్రధాన రోడ్డుపై ద్విచక్ర వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపారు. అటువైపు నుంచి రాంగ్ రూట్లో వాహనాలు నడుపుతూ పప్రమాదాలకు కారణమవుతున్నారు. ద్విచక్రవాహనాలే కాకుండా కార్లు కూడా రాంగ్ రూట్లో వస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చొరవ తీసుకొని తగు జాగ్రత్తలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- జిల్లా బీఆర్ఎస్ యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్

నవతెలంగాణ-టేక్మాల్



టేక్మాల్ మండలంలోని పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని బీఆర్ఎస జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలో వరి కోతలు ప్రారంభమైనప్పటికీ కొన్ని గ్రామాలలో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదన్నారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో కో ఆపరేటివ్ సొసైటీ, ఐకేపీ, డీసీఎంఎస్‌లకు సంబంధించి గతంలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండేవన్నారు. ప్రస్తుతం ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారన్నారు. గ్రామ పంచయతీతో పాటు మండలంలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నాయికోటి భాస్కర్ కోరారు..

నూతన మున్సిపల్ కమిషనర్‌గా గణేష్ రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్ : తూప్రాన్ నూతన మున్సిపల్ కమిషనర్‌గా పి.గణేష్ రెడ్డి నియామకమయ్యారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారి గణేష్ రెడ్డిని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ తూప్రాన్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఖాజా మొయినుద్దీన్‌ను బదిలీ చేశారు. కమిషనర్ ఖాజా మొయినుద్దీన్‌కు ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు. నూతన మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.



ముత్యాలమ్మ విగ్రహ పునర్ ప్రతిష్ట

నవతెలంగాణ-చిన్నశంకరంపేట



మండలంలోని కామారం గ్రామంలో ముత్యాలమ్మ విగ్రహ పునర్ ప్రతిష్ట కార్యక్రమం, బోనాల కార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారి ఊరేగింపు, గంగ స్నానం, అనంతరం ముత్యాలమ్మ పునర్ ప్రతిష్ట కార్యక్రమం జరిపారు. సోమవారం అమ్మవారికి బోనాల కార్యక్రమం ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేసిన మోహన్ నాయక్


నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన మెట్టు బాల రాజు(46) దాదాపు20 రోజుల క్రితం గుండెపోటుతో మరణించాడు. బాల రాజు కుటుంబ పరిస్థితుల గురించి తెలుసుకున్న లీలా గ్రూప్ చైర్మెన్ డాక్టర్ మోహన్ నాయక్ వెంటనే స్పందించి బాలరాజు కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5000లు, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, రాము, సుభాష్, నాజం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో కాద్లూర్ గ్రామం

నవతెలంగాణ-టేక్మాల్



పంచాయతీ అధికారులు నిధులు లేవనే కుంటి సాకుతో పాలనను గాలికి వదిలేశారు. మురికి కాలువలలో దోమలు పెరిగి ప్రజలు విష జ్వరాలకు గురవుతున్నారు. మండల పరిధిలోని కాద్లూర్ గ్రామం సమస్యల వలయంలో చిక్కుకుంది. గ్రామంలో పారిశుధ్య లోపం కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా అధికారులు మాత్రం అటువైపు చూసిన దాఖలాలు లేవు. తాగు నీటి సమస్యతో ప్రజలు తల్లడిల్లుతున్న గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం వాళ్లకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నాటినుండి గ్రామంలో సమస్యలు తిష్ట వేసుకొని కూర్చున్నాయి. సర్పంచ్ పదవి కాలం ముగిసిన తర్వాత ఉన్నతాధికారులు గ్రామానికి ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశారు. కానీ ప్రత్యేక అధికారి గ్రామం వైపు చూసిన సందర్భాలే కరువయ్యాయి. గ్రామంలో మురికి కాలువల పూడికతీత లోపం వల్ల మురికి కాలువలు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉన్నాయి. దీంతో మురికి కాలువలలో దోమలు పెరిగి ప్రజలు విష జ్వరాలకు గురవుతున్నారని స్థానికులు వాపోయారు. గ్రామపంచాయతీ అధికారులు నిధులు లేవనే కుంటి సాకుతో పాలనను గాలికి వదిలేసారు. గ్రామంలో చాలీచాలక వస్తున్న మిషన్ భగీరథ నీళ్లకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా, అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న పారిశుధ్యం తాగు నీటి సమస్యలపై దృష్టి పెట్టి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆత్మగౌరవంతో జ్ఞాన సమాజం నిర్మిద్దాం

- స్వేరో జాతీయ మహాసభలో చైర్మెన్ మామిడాల ప్రవీణ్



నవతెలంగాణ-బెజ్జంకి

అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం లక్ష్యంగా ఆత్మగౌ రవంతో జ్ఞాన సమాజాన్ని నిర్మిద్దామని స్వేరోస్ నెట్ వర్క్ ఎక్స్ క్యూటీవ్ చైర్మెన్ మామిడాల ప్రవీణ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక సత్యార్జున గార్డెన్ యందు మహాసభ కన్వీనర్ బొర్ర సురేష్ కుమార్ స్వేరో, జిల్లాధ్యక్షులు ఉప్పులేటి బాబు స్వేరో అధ్వర్యంలో స్వేరోస్ నెట్ వర్క్ జాతీయ మహాసభ నిర్వహించారు. మహాసభకు యుఎస్ సోలోమోన్, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ చంద్రబాబు, టీఏఎస్ఎస్ అధ్యక్షుడు నల్ల బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వేరోస్ నెట్ వర్క్ వ్యవస్థాపకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సారథ్యంలో ప్రతి వ్యక్తిలో సమూలంగా వ్యక్తిత్వాన్ని పెంపోందించి జ్ఞానార్జనే ధ్యేయంగా అట్టడుగు వర్గాలను అభ్యున్నతిలో నడిపించే సరికొత్త పాత్ర స్వేరోస్ నెట్ వర్క్ పోషిస్తుందని ముఖ్య అతిథులు కొనియాడారు. అంతకుముందు స్థానిక సత్యసాయి విద్యాలయం నుంచి సత్యార్జునా గార్డెన్ వరకు 2కే రన్ నిర్వహించారు. రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బలుగురి దుర్గయ్య, వీరయ్య, ప్రకాశ్, మాతంగి మారుతి, సీనియర్ స్వేరో బోనగిరి ప్రభాకర్, చిన్నికృష్ణ, స్వామి ప్రవీణ్, మోహన్, రాజు, అనిల్, రాష్ట్రంలోని స్వేరోస్ నెట్ వర్క్ సభ్యులు హాజరయ్యారు.

ఫైవ్ ఫ్లవర్ రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎంపీ

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల పట్టణ కేంద్రంలో నూతంగా ఏర్పాటు చేసిన ఫైవ్ ఫ్లేవర్స్ రెస్టారెంట్‌ను ఆదివారం భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి బాంకెట్ హాల్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, ఉద్యోగాలు రాణి యువత నిరాశగా చెందకుండా ఇలాంటి ఉపాధి అవకాశాలు అంది పుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ యజమాని నూకల స్వాగత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొమ్ము నర్సింగరావు, ఉడుముల భాస్కర్ రెడ్డి, బాల్ రెడ్డి, ఆది శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అప్పుల పాలవుతున్న అంగన్‌వాడి సిబ్బంది

- వెట్టి చాకిరికి కారెకులెవరు
- 50 ఏళ్లుగా వెట్టి చాకిరి
- కొత్త సీఎం అయిన ఆదుకుంటారా



నవతెలంగాణ- రామాయంపేట/మెదక్

అంగన్వాడిలు ప్రజలకు సేవలను అందిస్తు 50 ఏళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సరైన వేతనాలు లేక అప్పుల పాలవుతున్నారు. ఎవరైనా వెట్టి చాకిరి చేసేవాళ్లపై కేసు నమోదు చేసే ప్రభుత్వమే తమతో 50 ఏళుగా వెట్టిచాకిరి చేయించుకుంటుందని అంగన్ వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉన్న అంగన్వాడీ సిబ్బందిని పట్టించుకోకపోవడం దారుణం. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రతి గడప వద్దకు తీసుకెళ్లేది అంగన్వాడీ సిబ్బంది మాత్రమే. సిబ్బందిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం మూలంగా వాళ్ళ బతుకులు మారడం లేదు. రోజు రోజుకు దుర్భరంగా మారుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు సిబ్బంది సేవలు అందిస్తున్నా, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. వాళ్ళ బతుకులు మార్చే నాయకుడు లేకపోవడం దారుణం. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆన్లైన్, ఆఫ్‌లైన్ సేవలు అందిస్తున్నారు. సిబ్బందికి కనీస వేతనం అందించకుండా, ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంతో వారు మానసిక ఆందోళనకు గురై గుండెపోట్లు వచ్చిన సందర్భాలున్నాయని అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల బతుకులు ఇంతేనా



రాష్ట్ర ప్రభుత్వం అందరిని ఆదుకుంటామని చెబుతున్నా అమలు చేయడం లేదని, ఇదే విధంగా నిర్లక్ష్యం చేస్తే పోరాటాలు చేయక తప్పదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నర్సమ్మ తెలిపారు. సరిపోని వేతనాలతో అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది వేతనాల గురించి ప్రతిపక్షంలో ఉండగా ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరొక మాట్లాడడం సరైనది కాదన్నారు. అందరి సంక్షేమం కోసం పాటుపడుతున్నామని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి సిబ్బందికి కనీస వేతనం రూ.30 వేలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

నరసమ్మ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు

సెంటర్లు ప్రారంభించినా... ధాన్యం కొనుగోల్లు శూన్యం

- దళారులదే రాజ్యం వారు నిర్ణయించిందే ధర
- ధాన్యం కొనుగోళ్ళు ఎప్పుడు ..?



నవతెలంగాణ-దుబ్బాక

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం బోనస్, రైస్ మిల్లర్ల కేటాయింపు పై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యాన్ని నిల్వ చేయలేక, వర్షం నుంచి కాపాడుకోలేక నానా తిప్పలు పడుతున్నారు. దుబ్బాక మున్సిపల్ కేంద్రంతోపాటు మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో, మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ.. ధాన్యం సేకరణకు కేంద్రాల నిర్వాహకులు ముందుకు రావడం లేదు. కల్లాల వద్ద, రోడ్ల వెంట ఆరబోసి నిల్వ ఉంచిన ధాన్యం రాశులు అకాల వర్షాలతో ఎక్కడ తడిసి కొట్టుకుపోతాయో అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. గత నెల రోజులుగా వరి కోతలు ప్రారంభమైనాయి. తమ పంటను ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునేందుకు మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. కేంద్రాలను ఏర్పాటు చేసినా ఇంకా మొదలు పెట్టలేదు. దీంతో రైతులు వ్యాపారులను, దళారులను ఆశ్రయిస్తున్నారు.

3 లక్షల 25 వేల మెట్రిక్ టన్నుల వరి సాగు

ఈ ఏడాది వర్షాకాలం సీజన్ లో సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 25 వేల మెట్రిక్ టన్నుల వరి సాగు చేశారు. దుబ్బాక వ్యవసాయ డివిజన్ పరిధిలో (దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్ పేట-భూంపల్లి, దౌల్తాబాద్, రాయపోల్, తోగుట మండలాలు) 55,793 మంది రైతులు 83,964 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 14,452 ఎకరాల్లో సన్న వరిని సాగు చేశారు.ప్రస్తుతం పంట చేతికి వస్తుంది. కొన్ని ప్రాంతాల్లోని రైతులు పంటలు కోయడంతో పాటు అమ్మకాలు చేస్తున్నారు. ముఖ్యంగా సన్న రకం వడ్లను సాగుచేసిన రైతులు ఎక్కువ మొత్తంలో మద్దతు ధర వస్తుందని కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురుచూస్తున్నారు. ఈ సీజన్ నుండే క్వింటాల్ సన్నవడ్లకు రూ.500 బోనస్ అదనంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు కోసిన పంటను అమ్ముకోవడం లేదు. రోడ్ల వెంబడి, కల్లాల వద్ద, కొనుగోలు కేంద్రాల తమ ధాన్యాన్ని నిల్వ ఉంచుతున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల ధాన్యం తడిసి కొంతమేర నష్టపోతున్నారు. వర్ష భయంతో పెద్ద రైతులు మాత్రం పంట కోయగానే ధర తక్కువగా వచ్చినా సరే మిల్లర్లతో ఒప్పందాలు చేసుకుని పచ్చి ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇలా క్వింటాల్ కు రూ.1800 నుంచి రూ.2000 వరకు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ మద్దతు ధర కన్నా తక్కువైనా సరే అకాల వర్షాల భయంతో ఎంతో కొంతకి అమ్ముకుంటున్నారు. ఈ నెలాఖరులోగా వరి ధాన్యం మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉంది.

జిల్లా వ్యాప్తంగా 417 కొనుగోలు కేంద్రాలు

రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు గాను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. అందులో భాగంగా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 417 కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 211 - ఐకేపీ, 200- పీఏసీఎస్, 6- మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ కొనుగోలు ప్రక్రియ నేటికీ ప్రారంభం కావడం లేదు. దీంతో దళారులదే రాజ్యంగా హవా నడుస్తోంది.



ధర నిర్ణయించేది దళారే

పండించిన పంటకు పెట్టుబడి ఎక్కువ లాభం తక్కువ అన్నట్లుగా ఉంది రైతుల పరిస్థితి. ఆరుగాలం చేసిన కష్టం, కూలీల, రవాణా ఖర్చులు, ఎరువులు ఇలా పలు ఖర్చులు పోను అన్నదాతలకు కన్నీరే మిగులుతుంది. తన పంటను నచ్చిన ధరకు అమ్మకోడానికి వీలు లేకుండా పోతుంది. ధాన్యం సేకరణ ఆలస్యం అవుతుండడంతో దళారి నిర్ణయించిన రేటుకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. దీంతో దళారి వ్యాపారులు రైతుల్ని నిలువు దోపిడీ చేస్తున్నారు. ధాన్యానికి ఆశించిన గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. దళారులు, వ్యాపారులు రాజకీయ పలుకుబడి ఉన్న భూస్వాములు పెద్ద రైతుల పచ్చి ధాన్యానికి ఒక ధరను, అదే చిన్న, సన్నకారు రైతుల పచ్చిధాన్యానికి మరొక ధరను నిర్ణయిస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బుల్ని ఆయా రైతులకు ఇవ్వడంలో కూడా దళారీలు అవలంబిస్తున్న పక్షపాత వైఖరి చిన్న, సన్నకారు రైతులను తీవ్ర మనోవేదన గురిచేస్తుంది. ఈ తతంగమంతా తెలిసీ ప్రభుత్వ అధికారులు మిన్నకుంటున్నారన్న విమర్శలున్నాయి.

సర్కార్‌కు రావాల్సిన ఆదాయాన్ని దళారులు దోపిడీ

అన్నదాతల నుంచి పంటను కొనాలంటే వ్యాపారులు పలు ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు, లైసెన్సులు పొంది ఉండాలి. కానీ ఇవేవీ లేకుండానే సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతంలో పచ్చి ధాన్యాన్ని దళారుల ముఠా తనకు నచ్చిన ధరకే కొనుక్కుంటున్నారు. అటు రైతులు నష్టపోవడమే కాకుండా సర్కారుకు రావాల్సిన ఆదాయాన్ని దళారులు, వ్యాపారులు దోచుకుంటున్నారు. మార్కెటింగ్, వ్యాపార వాణిజ్య, ఆదాయ పన్నుల శాఖ, రవాణా, పంచాయతీ, రెవిన్యూ ఇలా పలు ప్రభుత్వ శాఖల అనుమతులతో కూడిన లైసెన్సులు కలిగి ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇవేవీ లేకుండానే దళారులు, వ్యాపారులు కొంతమంది లీడర్లు, ఆఫీసర్ల సహకా రంతో ఈ దందాను సాఫీగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని పలువురు రైతులు కోరుతున్నారు.



టార్గెట్ 4 లక్షల మెట్రిక్ టన్నులు

రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. వడ్ల తూకం కోసం అవసరమయ్యే కాంటాలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచుతున్నాం. నీడ కోసం టెంట్లు, త్రాగునీరు, రాత్రి వేళల్లో కరెంటు లైట్ల ఏర్పాట్లు వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. క్వింటాల్‌ఏ - గ్రేడ్ ధాన్యానికి రూ.2320, సాధారణ గ్రేడ్ ధాన్యానికి రూ.2300 ల ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. క్వింటాల్ సన్నరకం వడ్లకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుంది. ధాన్యం సేకరణకు జిల్లా వ్యాప్తంగా 417 కొనుగోలు కేంద్రంలను ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 25 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వడ్లు ,75 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లు పండించారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నాం. 7959 - టార్పాలిన్ కవర్లు , 532 -మ్యాచర్ మిషన్లు, 660 -తూకం మిషన్లు, 588 -ప్యాడి క్లీనర్లు సిద్ధంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 148 రైస్ మిల్లులు ఉన్నాయి. అందులో 98 -రా మిల్లులు, 50 -బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ ధాన్యం 99 శాతం సేకరించాం. ఇంకా 1 శాతం మిగిలి ఉండగా ఈనెలాఖరు వరకు పూర్తి చేస్తాం. త్వరలోనే ధాన్యం కొనుగోలను మొదలుపెడతాం.

-జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ

స్పీడ్ తక్కువ..సమయం ఎక్కువ

- గజ్వేల్ రైలు ప్రయాణం కన్నా బస్సు ప్రయాణం మిన్న
- కేసీఆర్ లక్ష్యం మంచిదే కానీ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులకు పాటు రైల్వే లైన్ ఉండాలనేది కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకొని రైల్వే ప్రాజెక్టుకు నిధులను కేంద్రం నుంచి కొంత వరకు సహకారం తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకుపోయారు. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు ప్రతిపాదన పంపి సిద్దిపేట వరకు పనులు పూర్తి చేశారు. సిద్దిపేట నుంచి కొత్తపల్లి వరకు పనులు కొనసాగుతున్నాయి. గజ్వేల్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచేందుకు కేసీఆర్ కన్నకలలు కొంత వరకు పూర్తి అయిందని చెప్పాలి. గజ్వేల్లో సాగు గురించి ప్రాజెక్టు తీసుకువస్తామని పోచమ్మ సాగర్ ప్రాజెక్టు, దుబ్బాకలో మల్లన్న సాగర్ ప్రాజెక్టును, సిద్దిపేటలో రంగనాయక సాగర్ ప్రాజెక్టును నిర్మించారు. ఈ మూడు ప్రాజెక్టులతో పాటు పొడవైన రైల్వే లైన్ ఈ ప్రాంతంలో పోతే అభివృద్ధి చెందుతుందని కేసీఆర్ భావించారు. కేసీఆర్ భావించి రైల్వే లైన్ తీసుకొచ్చారు. అయితే ప్రయాణికులు లేక వెలవెలబోతుందని విమర్శలు వస్తున్నాయి. మనోహబాద్ మీదుగా సిద్దిపేటకు వచ్చే రైలు స్పీడ్‌గా తక్కువగా ఉండటం, ప్రయాణానికి సమయం ఎక్కువగా తీసుకోవడంతో ఈ రైలు ఎక్కేందుకు ప్రయాణికులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్కు వెళ్లడానికి రైల్లో మూడున్నర నుంచి నాలుగు గంటల వరకు సమయం పడితే, అదే బస్సులు అయితే సుమారు రెండు గంటల సమయం పడుతుంది. దీంతో మనోహరాబాద్ గజ్వేల్ సిద్దిపేట మార్గంలో ప్రయాణికులు లేక రైలు వెలవెలబోతుంది. 8 భోగీలతో నడుస్తున్న ఈ రైల్లో ఒక గార్డు, ఇతర అవసరాలు పోగ ఏడింటిలో మొత్తంగా ఒక్క ట్రిప్పులో 644 మంది ప్రయాణం చేయవచ్చు. రోజుకు రెండు పోను రాను రెండు ట్రిప్పులు నడుస్తున్న 100 మందికి మించి ప్రయాణించడం లేదు. రైలు వేగం కేవలం 60 కిలోమీటర్ల పరిమితమై సికింద్రాబాద్ వరకు ప్రయాణ సమయం నాలుగు గంటలు పట్టడమే ఇందుకు ప్రధాన కారణమని ప్రయాణికులు అంటున్నారు.

రోజుకు రెండు అప్ అండ్ డౌన్ ట్రిప్పులు

ప్రతి బుధవారం మినహా మిగిలిన ఆరు రోజుల్లో ప్యాసింజర్ రైలు రోజుకు రెండు ట్రిప్పులు మాత్రమే నడుస్తుంది. ఉదయం 6.45 గంటలకు సిద్దిపేటలో బయలుదేరి. దుద్దెడ, లకడారం, కొడకండ్ల, గజ్వేల్, అప్పాయిపల్లి, నాచారం, మేడ్చల్, బొల్లారం, మల్కాజ్గిరి, సికింద్రాబాద్కు ఉదయం 10.15 గంటలకు చేరుకుంటుంది. తిరిగి సికింద్రాబాద్ నుంచి ఉదయం 10.35 గంటలకు బయలుదేరి సిద్దిపేట వరకు మధ్యాహ్నం 1.45 నిమిషాలకు చేరుతుంది. అన్ని సహజవుగా సాగితే సిద్దిపేట నుంచి సికింద్రాబాద్కు వెళ్లాలన్న అక్కడి నుంచి సిద్దిపేటకు రావాలన్న 3.30 గంటల ప్రయాణం తప్పదు. ట్రైన్ లేట్ అయిన సిగ్నల్ సమస్య వచ్చిన ఆలస్యం అవుతుంది. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్కు బస్సులో వెళ్తే కేవలం రెండు గంటల సమయమే పడుతుందని ప్రయాణికులు అంటున్నారు. ఈ కారణ వల్ల ఈ రైలుపై ఆసక్తి చూపడం లేదు. మనోహరాబాద్ నుంచి సికింద్రాబాద్ వరకు ప్రయాణికుల జోరు రైలు మనోరబాద్ స్టేషన్ వెళ్ళగానే అక్కడ్నుంచి సికింద్రాబాద్ వరకు వంద కిలో మీటర్ల వేగంతో వెళుతుండగా ఈ మార్గంలో రద్దీ భారీగా ఉంటుంది. కేవలం మనోలాబాద్ నుంచి సిద్దిపేట వరకు మాత్రం అతి తక్కువ ప్రయాణికులతో వెళుతుంది. ప్రస్తుతం సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వరకు 117 కిలోమీటర్ల ప్రయాణిస్తున్న రైలు మనోహరాబాద్ వరకు 74 కిలోమీటర్ల అతి తక్కువ ప్రయాణికులతో, ఆ తర్వాత మనోరాబాదు నుంచి సికింద్రాబాద్ వరకు 43 కిలోమీటర్ల ప్రయాణికులతో రద్దీగా వెళుతుంది.

మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి

మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151 కిలోమీటర్ల పొడుగునా న్యూ బ్రాండ్ గేజి లైన్ నిర్మాణం జరుగుతుండగా రూ.1160.47 కోట్లు మంజూరు చేసి 2017లో పనులు ప్రారంభించారు. ఈ రైల్వే లైన్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మనోహరాబాద్ మీదుగా కొత్తపల్లి వరకు అక్కడ నుంచి పెద్దపల్లి గ్రాండ్ ట్రంక్ లైన్‌తో అనుసంధానం కానున్నది. ఫలితంగా ఈ లైన్ హైదరాబాద్, న్యూఢిల్లీ, కోల్‌కత్తా లాంటి మహా నగరాలకు కలుపుతూ జాతీయ లైన్‌గా నిర్మాణం జరగనున్నది. మనోరబాద్ కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి అయితే ప్రయాణికులకు దూర భారం తగ్గుతుంది. గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల, తదితర ప్రాంతాల ప్రజలకు ప్రయాణం సులువుగా అవుతుంది. దీనిపై రైల్వే శాఖ ఉన్నత అధికారులతో మాట్లాడి స్పీడ్ పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. కొత్తపల్లి వరకు రైల్వే లైన్ పూర్తయితే మరింత ప్రయాణికుల రద్దీతో ఈ రైలు మరింత ముందుకు 0పోయే అవకాశం ఉంది.

సాయిబాబా స్ఫూర్తితో హక్కుల పరిరక్షణకు గొంతు విప్పాలి

నవతెలంగాణ-సిద్దిపేట



ప్రొఫెసర్ సాయిబాబా ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకు వెళ్లి పౌర ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, రచయితలు గొంతు విప్పాలని వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఇటీవల మరణించిన సామాజిక ఉద్యమ నేత ప్రొఫెసర్ జీ.ఎన్. సాయిబాబా సంస్మరణ సభ జరిగింది. తెలంగాణ పౌరహక్కుల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు రాగుల భూపతి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు జి.సత్తయ్య అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రావు, సాయిబాబా కూతురు మంజీర, రచయిత దారం మల్లా రెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంఘం, మంజీరా రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కె.రంగాచారి, ప్రజా కళా మండలి రాష్ట్ర అధ్యక్షులు జాన్, ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకుడు రాజ నర్సింహ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల స్వామి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మంద పవన్, తదితరులు ప్రసంగించారు. వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా తన జీవితాంతం ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేశాడన్నారు. దేశ సంపద, సహజ వనరులు కార్పొరేట్ శక్తులకు కాకుండా ఈ దేశ ములవాసులకు, ఆదివాసులకు,పేద ప్రజలకు దక్కాలని సాయిబాబా తపన పడ్డాడని తెలిపారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం సాయిబాబా పోరాటం చేశాడని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర నిర్వహించాడని అన్నారు. ఆయన చేసిన పోరాటాలు గిట్టని ప్రభుత్వాలు ఆయన పై కక్ష కట్టి ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి జైల్లో పెట్టారన్నారు. 90 శాతం అంగ వైకల్యంతో ఉన్న సాయిబాబాకు బెయిల్ ఇవ్వకుండా అండా జైలులో చిత్రహింసలకు గురించేశారన్నారు.. ఏడు నెలల క్రితం నిర్దోషిగా జైలు నుంచి బయటకు వచ్చిన సాయిబాబా ఆరోగ్యం క్రమంగా క్షీణించి తీవ్రమైన అనారోగ్యంతో మృతి చెందాడు. వెనకడుగు వేయకుండా తాను నమ్మిన సిద్ధాంతం కోసం, ఎంచుకున్న మార్గం కోసం పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడిన అమరుడు ప్రొఫెసర్ సాయిబాబా ఆశయ సాధనకు నేటి తరం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సాయిబాబా ను చంపిన ఉపా చట్టం రద్దు కోసం పౌర సమాజం ముందుకు రావాలని సంస్మరణ సభలో ప్రసంగించిన ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు.

పునర్విభజనతో..పుట్టేడు సమస్యలు..!

- గత ప్రభుత్వం స్వార్థంతో విడదీసిందని విమర్శలు
- ఉనికిని కోల్పోయిన బెజ్జంకి మండలం
- సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి
- చిత్తశుద్ధితో మండలాన్ని తిరిగి కరీంనగర్‌లో కలుపాలని పలువురి డిమాండ్

నవతెలంగాణ-బెజ్జంకి



తెలంగాణ రాష్ట్రంలో 2016లో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం పేరునా కొత్త జిల్లాలను పునర్విభజన చేసింది. మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం రాజకీయ స్వార్థం కొరకు మూడు ముక్కలు చేసింది. నియోజకవర్గంలోని బెజ్జంకి మండల ప్రజల మనోభావాలను లెక్కచేయకుండా మండలాన్ని రెండు మండలాలుగా విభజించి గన్నేరువరాన్ని కరీంనగర్ జిల్లాలోనూ, బెజ్జంకి మండలాన్ని సిద్దిపేట జిల్లాలో బలవంతంగా కలిపింది. దీంతో బెజ్జంకి మండలం ఉనికిని కోల్పోయింది. దీంతో మండల ప్రజలు పునర్విభజనతో నేటికి పుట్టేడు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా గత ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలో కలిపారని తిరిగి ఈ మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలుపుతామని ఎన్నికల సందర్భంగా నాటి పీసీసీ అధ్యక్షుడు, నేటి సీఎం రేవంత్ రెడ్డి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ శివారులోని టోల్ ప్లాజా వద్ద 2023 డిసెంబర్ 23న నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి వెంటనే నిలబెట్టుకునేలా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవచూపాలని మండలంలోని మెజారిటీ ప్రజలు కోరుతున్నారు. తనను గెలిపిస్తే మండలాన్ని కరీంనగర్ జిల్లాలో పున్ణవిలీనం చేసి ప్రజల మనోభావాలను నెరవేరుస్తానని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి మంచి మెజార్టీతో ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలిచి నెలలు గడుస్తున్న ప్పటికీ హామీని అమలు చేయడంలో కనీస ప్రయత్నం చేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ప్రభుత్వం మళ్లీ ఎన్నికల దాకా ఈ విషయాన్ని సాగదీస్తుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన రావడానికి ముందే మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలిపి తీరాలని లేని పక్షంలో మండలంలో కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో భంగపాటు తప్పదని పలువురు ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల సమయంలో మండలాన్ని కరీంనగర్ జిల్లాలో తిరిగి కలుపడమే ప్రధాన ధ్యేయమని ప్రగడ్బాలు పలికిన స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ఈ అంశంపై ప్రస్తుతం ఊసేత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు మండలంలో రసవత్తరంగా మారనున్నాయి.

రిజర్వేషన్ల కొరకు ప్రజా అభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-సిద్ధిపేటకలెక్టరేట్

ఈనెల 30వ తేదీన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల కమిషన్ (బీసీ) బృందం స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆసక్తి కలిగిన సిద్ధిపేట జిల్లాలోని రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజలు హాజరై తమ అభిప్రాయాలను కమిషన్ ముందు ఉంచాలని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బృందం 30న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంగారెడ్డిలోని జిల్లా కలెక్టరేట్ లో కమిషన్ చైర్మెన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్ తో కూడిన సభ్యుల బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనున్నదని తెలిపారు. అభిప్రాయాలను తెలియజేయాలనుకునేవారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా కమిషన్‌కు అందజేయాలని సూచించారు. నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. తమ అభ్యర్థనలకు బలం చేకూర్చేలా వారు తమ వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్షాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొనవచ్చుని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

వ్యాపారస్తులు నియమ నిబంధనలను పాటించాలి



- హుస్నాబాద్ ఏసీపీ వి.సతీష్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాల్లో వ్యాపారస్తులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని హుస్నాబాద్ ఏసీపీ వి.సతీష్ అన్నారు. ఆదివారం ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీస్, మున్సిపల్, అగ్ని మాపక శాఖలు, విద్యుత్ శాఖ నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణాల సమీపంలో ఇసుక, నీరు, రెండు ఫైర్‌ఎక్స్ ట్రిమిషన్‌లు ఉంచాలని సూచించారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణదారులు తప్పని సరిగా తమ లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలన్నారు. టపాసుల దుకాణానికి నిర్దేశిత రుసుము, విద్యుత్, ఫైర్ శాఖతో పాటు మున్సిపల్ శాఖల ఎన్‌ఓసీ అనుమతి తప్పనిసరి ఉండాలన్నారు. దుకాణాలను జనావాసాల మధ్య ఎట్టి పరిస్థితుల్లోనూ ఏర్పాటు చేయరాదని సూచించారు.

అక్కన్నపేటకు అంబులెన్స్ మంజూరు చేయాలి



- బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం సిద్ధిపేట జిల్లాలోనే అతిపెద్ద మండలమని అలాం టి ఈ మండలంలో కనీస వసతులు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ పశ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కన్నపేట మండలంలో 39 గ్రామపంచాయతీలు ఉన్నాయని మొత్తం 35వేల జనాభా నివసిస్తున్నారని అన్నారు. అలాంటి ఈ మండలంలో కనీసం పాము, తేలు కుట్టిన మందులు అందుబాటులో లేవని తెలియజేశారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే కనీసం అంబులెన్స్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. 75 ఏండ్ల తర్వాత హుస్నాబాద్ ప్రాంతానికి మంత్రి పదవి వచ్చిన పరిస్థితులు మారలేదని అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి నిర్మించి గిరిజనులను ఆదుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుగందుల శంకర్, తదితరులు, పాల్గొన్నారు.

స్లాటర్ హౌస్‌లో కోసిన మాంసాన్నే అమ్మాలి



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలో ఎవరైనా మాంస విక్రయదారులు స్లాటర్ హౌస్‌లో డాక్టర్ చేత గుర్తించబడిన మేకలు, గొర్రెలను మాత్రమే ప్రజలకు అమ్మాలని శానిటరీ ఇన్స్పెక్టర్ వనిత సూచించారు. ఆదివారం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులో మాంస విక్రయదారులతో ఆమె మాట్లాడారు. స్లాటర్ హౌస్‌లో తీసుకొచ్చినట్లు రసీదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవెల్లి గ్రామంలో మురికి కూపం



- రోడ్లపై పారుతున్న మురికి కాలువలు
- బాగు చేయాలని బీఆర్‌ఎస్ నాయకుల వినతి

నవతెలంగాణ-అక్కన్నపేట

మండలం గౌరవెల్లి గ్రామంలో మురుగునీరు వల్ల మురికి కూపం ఏర్పడడంతో ప్రజలు ఎన్నో ఇబ్బం దులు పడుతున్నారని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు సూరంపెల్లి పరశురామ్, గోపగోని అరవింద్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత వర్షాకాలం నుంచి వరద నీరు ఇండ్లలోకి చేరి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మురుగునీరు వల్ల ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. ఈ విషయంపై గ్రామాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని, మంత్రి ఇలాకాలో ఇలాంటి పరిస్థితులు ఉండడం దారుణమన్నారు. వెంటనే ఈ సమస్యను క్లియర్ చేయకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షులు బైరగోని శ్రీనివాస్, సీనియర్ నాయకులు మజ్జిక మధు, తదితరులు, పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాము లపర్తి గ్రామానికి చెందిన నీల కర్ణాకర్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందాడు. ఆదివారం మర్కుక్ మాజీ ఎంపీపీ తాండ పాండుగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నీల యాదగిరి, పోచయ్య రాజు, కనకయ్య, లక్ష్మయ్య,పెద్దులు, స్వామి,శ్రీను తదితరులున్నారు.ఆదివారం బీజేపీ మర్కుక్ మండల ఉపాధ్యక్షులు తాడూరు మహేష్ గౌడ్ నీల కర్ణాకర్ బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని ఇవ్వగా పాములపర్తి బీజేపి నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాండ స్వామిగౌడ్ , కోత్వాల్ రాజు,సురేష్, స్వామి, మహేష్ , నితిన్, హరికృష్ణ, లింగం, రాజు, తదితరులున్నారు.

నూతన కమిటీ సభ్యులకు ఘన సన్మానం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ కిరాణా అసోసియేషన్ ఆధ్వర్యం లో ఆదివారం ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆర్య వైశ్య మహాసభ గజ్వేల్ మండల అధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్, గజ్వేల్ మండల ఆర్యవైశ్య యువజన అధ్యక్షులు నేతి గౌరీశంకర్, ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధి బిక్షపతి, నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీకి అభినందనలు తెలిపి ఆర్యవైశ్యుల హక్కుల సాధన కోసం నూతన కమిటీ కృషి చేయాలని సమాజ సేవలో తమ వంతు పాత్ర పోషించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెట్ రాములు, ఉపాధ్యక్షులు మల్యాల వెంకటేశం. ప్రధాన కార్యదర్శి సూర ఆంజనేయులు, కోశాధికారి వెంకటేశం, ఉపాధ్యక్షులు అయిత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండపాక శ్రీనివాస్, కోశాధికారి కొమరవెల్లి రమేష్, నాయకులు తేరాల రాజు, ప్రసాద్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గూడెం గ్రామంలో ఎమ్మా ర్పీఎస్ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించినట్టు ఆదివారం మండలాధ్యక్షులు జనాగం శంకర్ తెలిపారు. గ్రామాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, అధికార ప్రతినిధిగా మంకాల బాబు, మంకాల రాజమల్లు, శ్రీకాంత్, మంకాలి బాబు, తాడూరీ వెంకటేష్, లింగంపల్లి అనిల్, పలువురు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు శంకర్ తెలిపారు.

గాల్లో దీపంలా విద్యార్థుల భవిత

- లెక్చరర్లలో కొరవడిన సమర్థత.!
- దుబ్బాకలో కునారిల్లుతున్న డిగ్రీ విద్య



నవతెలంగాణ-దుబ్బాక

ప్రభుత్వం దోస్త్ (డిగ్రీ ఆన్ లైన్ సర్వీస్ తెలంగాణ) ద్వారా ప్రతీయేటా పలు కోర్సుల్లో నూతన ప్రవేశాలు నిర్వహిస్తోంది. 2024 - 25 విద్యా ఏడాదికి గాను డిగ్రీ ప్రథమ ఏడాదిలో ప్రవేశాల గడువు పలుమార్లు పెంచారు. అయినప్పటికీ విద్యార్థుల సంఖ్య పెరగడం లేదు. ఏటికేడు తగ్గుతున్నాయి. మూడు గ్రూపులకు (బీ.ఏ -హెచ్‌ఈపీ, బీఎస్సీ- బీజెడ్‌సీ, బీ.కామ్-కంప్యూటర్స్) ప్రతి గ్రూపుకు 40 సీట్ల చొప్పున మొత్తం 120 సీట్లు ఉండగా మొత్తంగా కలిపి 70 సీట్లు కూడా భర్తీ కావడం లేదు. చాలావరకు సీట్లు మిగిలిపోతున్నాయి. దీంతో డిగ్రీ విద్య అనేది కునారిల్లుతుంది. ఈ దుస్థితి సిద్ధిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొంది.

గాల్లో దీపంలా పేద విద్యార్థుల భవిత ..

యూనివర్సిటీ విద్య అనేది అండర్ గ్రాడ్యుయేషన్ చదువులో ఒకప్పుడు 'సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అధ్యయన కేంద్రాలు'గా ఆయా కాలేజీలు ఉండేవి. ఇక్కడ చదివిన విద్యార్థులను ఆయా రంగాల్లో ఉన్నత స్థితికి చేర్చేవి. గతంలో కనీస సౌకర్యాలు కూడా లేవు. అధ్యాపకులకు చాలీచాలని జీతాలు ఉండేవి. కానీ నేడు ప్రభుత్వం లెచ్చరర్లకు రూ.లక్షల్లో జీతాలు చెల్లిస్తున్నా పాఠాలు సరిగా చెప్పకుండా తప్పించుకుని తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. ఆర్థికం గా బలంగా ఉన్న తల్లిద ండ్రులు వారి పిల్లలకు ఎంత ఖర్చు చేసైనా సరే ప్రయివేట్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. కానీ పేద కుటుంబాల పరిస్థితి ఏంటి..? గాల్లో దీపంలా విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారింది.

కలగానే బంగారు బాటలు..

పాఠశాల, ఇంటర్ విద్య ప్రయివేట్ పరం కావడంతో ఉన్నత చదువులు అనేవి నేడు వ్యాపారాలు అయ్యాయి. లా,ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడిసిన్, సీఏ తదితర కోర్సులన్నీ ఖరీదైనాయి. ఈ పరిస్థితుల్లో చాలామంది పేద, మధ్యతరగతి విద్యార్థులు తమ ఇంటి ఆర్థిక పరిస్థితులు బాగాలేక చదువు ముందుకు సాగించలేకున్నారు. వీరికి సాధారణ డిగ్రీ కోర్సులే దిక్కు అయ్యాయి. ఇంటర్ తర్వాత డిగ్రీలో చేరి తమ బంగారు భవితకు బాటలు వేసుకుందామనుకునే విద్యార్థులకు ఆ లక్ష్యం కళగానే మిగులుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతీఏటా విద్యార్థుల సంఖ్యను పెంచడం మాటను పక్కన పెడితే కనీసం భర్తీ చేయాల్సిన సీట్లే పూర్తిగా నిండడం లేదు. దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం 'దోస్త్ వెబ్ సైట్' ద్వారా డిగ్రీలో ప్రవేశాలు కల్పిస్తున్నప్పటికీ ప్రవేశాల సంఖ్య 100 కు చేరడం లేదు.

వచ్చామా, చెప్పామా, వెళ్ళామా...

పట్టుమని రూ.10 వేల జీతం కూడా అందుకోని ప్రయివేటు లెక్చరర్లు వారి కళాశాల విద్యార్థుల్ని ర్యాంకుల పంటలో ముంచేస్తుంటే ప్రభుత్వ లెక్చరర్లు మాత్రం వచ్చామా చెప్పామా ఇంటికెళ్ళామా అన్న తీరుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలకు తావిస్తోంది. ప్రయివేటు లెక్చరర్లు హాలిడేస్‌ల్లో కూడా క్లాసులు చెపుతూ తమ కుటుంబాన్ని పోషించుకున్నారు. కానీ రూ.లక్షల్లో జీతం అందుకుం టున్న ప్రభుత్వ లెక్చరర్ల తీరు ఇందుకు భిన్నంగా ఉంది. కాలేజీకి వచ్చామా, జీతం తీసుకున్నామా అన్న చందంగా బాధ్యతా రాహిత్యంగా పనిచేస్తున్నా రని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కళాశా లలో 12 మంది రెగ్యులర్ లెక్చరర్లు, ఇద్దరు నాన్ టీచింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. అయినా విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. దుబ్బాకలోని ప్రయివేటు, సిద్దిపేటలోని ప్రభుత్వ, ప్రయివేట్ కాలేజీలకే మొగ్గు చూపుతున్నారు. ఇక్కడ అధ్యాపకులు సరిగా బోధన చెప్పడం లేదన్న విమర్శలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఈ కారణంగా ఇక్కడ ప్రవేశాలు సగం కూడా జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

లెక్చరర్లలో కొరవడిన సమర్థత..

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిబద్ధత లేని మెజార్టీ లెక్చరర్లు పాఠాలు సరిగా చెప్పకుండా కేవలం టైంపాస్ కొరకు డ్యూటీలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రయివేటు కాలేజీతో కన్నా ప్రభుత్వ కాలేజీలో ఉత్తీర్ణత శాతం తక్కువే ఉంది. వెరసి డిగ్రీ పట్టా చేతికొస్తే చాలు అన్నట్లుగా విద్యార్థులు విధిలేక సరిపెట్టుకుంటున్న దైన్యస్థితి నెలకొంది. సమర్థులయితేనే కదా ప్రభుత్వ ఉద్యోగం వచ్చేది. మరి ఆ సమర్థత విద్యార్థులకు చెప్పే పాఠాల్లో ఎందుకు కొరవడింది.? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రయివేటుకు ధీటుగా విద్యా బోధనను అందించడం లేదు

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా అసంపూర్తి ఫంక్షన్ హాల్స్



నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని గ్రామాల్లో నిర్మించ తలపెట్టిన ఫంక్షన్ హాల్స్ అసంపూర్తిగా మిగలడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారాయి. మండల పరిధిలోని వెలికట్ట, అంకిరెడ్డిపల్లి, కొండపాక, జప్తి నాచారం తదితర గ్రామాల్లో గత ప్రభుత్వం ఒక్కో గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి పేద ప్రజల సౌకర్యార్థం ఫంక్షన్ హాల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే అధికారుల అలసత్వము కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం ఏమో కానీ అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కొన్నిచోట్ల వాటి చుట్టూ పిచ్చి మొక్కలు ముండ్ల పొదలు అల్లుకుపోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారాయి. కొన్నిచోట్ల పేకాట రాయులకు, మందుబాబులకు అడ్డగా మారి ఫంక్షన్ హాల్స్ చుట్టూ పగిలిన మద్యం సీసాలు పాలకులు, అధికారుల తీరును ప్రశ్నిస్తున్నాయి . కొన్ని గ్రామాల్లో ఫంక్షన్ హాల్స్ నిర్మాణం ఊరికి దూరంగా నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో మందుబాబులు ఈ ఫంక్షన్ హాల్స్‌లో మద్యం మత్తులో మునిగి తేలుతున్నారు. రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఫంక్షన్ హాల్స్ పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టక పోవడంతో అవి శిథిలం అయ్యే స్థితికి చేరుకుం టున్నాయి. ఈ అసంపూర్తి ఫంక్షన్ హాల్స్ కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయాలని భావించిన బిల్లులు వస్తాయో రావో అన్న భయంతో పనులు ముందుకు సాగడం లేదు. పాలకులు, అధికారులు ఇకనైనా స్పందించి, మండలంలో అసంపూర్తిగా ఉన్న ఫంక్షన్ హాల్స్‌ను పూర్తిస్థాయిలో నిర్మించి ఉపయోగంలోకి తీసుకురావాలని పలు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

ఫంక్షన్ హాల్స్ వినియోగంలోకి తీసుకురావాలి
సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అమ్ముల బాల నర్సయ్య

గత ప్రభుత్వ హాయంలో పేద ప్రజల సౌకర్యార్థం నిర్మించ తలపెట్టిన ఫంక్షన్ హాల్స్ అసంపూర్తిగా ఉన్న ఫంక్షన్ హాల్స్‌ను పూర్తిస్థాయిలో నిర్మించి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు.

రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలు



నవతెలంగాణ-గజ్వేల్

రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలను ఆదివారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బాచుపల్లిలోని, కాసాని కబడ్డీ అకాడమీలో నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ గుప్త , సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ళ శివ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ లో సంయుక్త కార్యదర్శిగా కుంటనోళ్ళ శివ కుమార్ ఏకగ్రీవ ఎన్నికయ్యారు. సిద్దిపేట జిల్లా కమిటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శికి రాష్ట్ర కార్యవర్గంలో చోటు దెక్కడం సిద్దిపేట జిల్లాకు గర్వకారణం అని సంతోష్ తెలిపారు. కబడ్డీ క్రీడాకాలను ప్రోత్సహిస్తూ అనేక జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో బాధ్యత వహిస్తూ రాష్ట్ర కబడ్డీ కార్యవర్గానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అనేక మంది కబడ్డీ క్రీడాకారులకు చేదోడువాదోడుగా సేవలంది స్తున్నందుకు గాను తగిన గుర్తింపు తెచ్చుకున్నారని అందుకురాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా కుంటనోళ్ళ శివ కుమార్‌ని 33జిల్లాల రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిద్దిపేట జిల్లా గడ్డకు గర్వకారణం అని తెలిపారు. ఎన్నికైన వెంటనే సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి సత్యం, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా సంయుక్త కార్యదర్శులు కార్యవర్గం , జిల్లా వివిధ కబడ్డీ క్లబ్ ల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రధా న కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ పాల్గొన్నారు. ఇండియా స్పోర్ట్స్ కోడ్ నియమం నిబంధనలకు వారి వయస్సు పైబడ టంతో ఈ రోజు జరిగిన ఎన్నికల్లో వారి స్థానాల్లో నూతనం గా ఎన్నికైన రాష్ట్ర కమిటీ అసోసియేషన్ అధ్యక్షులుగా కాసా ని వీరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మద్ది మహేందర్ రెడ్డి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, కోశాధికారిగా రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎన్నికయ్యారు.

అపూర్వ విద్యార్థుల సమ్మేళనం

- విద్యబుద్ధులు నేర్పించిన గురువులకు శాలువాలతో సన్మానం



నవతెలంగాణ-కోహెడ

కోహెడ శ్రీ లక్ష్మీ గార్డెన్‌లో కోహెడ జడ్పీహెచ్ఎస్ 1995-1996 పదోవతరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 28 ఏండ్ల అనంతరం ఈ వేదిక ద్వారా వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులందురు ఏకమై తమ చిన్ననాటి జ్ఞాపకాలతో ఆటపాటలతో సందడిగా ఆడిపాడారు. సుమారు 120 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని ప్రస్తుతం వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. ఈ వేదికపై తమ మిత్రులకు ఎవరెవరు ఏఏ రంగాల్లో కొనసాగుతున్నారో తెలిజేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇదే పాఠశాలలో చిన్ననాడు చదువుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి బొడిగే శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మహేందర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, తలారి సుధాకర్, మంద ఆదిమల్లు, హాజరైన గురువులు హాజరై నాటి విద్యార్థులను చూసి ముచ్చటిస్తూ మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



28 ఏండ్ల అనంతరం పదోతరగతి విద్యార్థులందరం ఈ వేదిక ద్వారా కలుసుకోవడం చాల సంతోషంగా ఉంది. తోటి విద్యార్థులతో ఆనందాన్ని గడుపడం సంతోషం. ఇకపై ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని అనుకుంటున్నాము. మాకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకోవడం చాల ఆనందంగా ఉంది.

-మ్యాకల సురేందర్ రెడ్డి

ఎన్నో ఏళ్ల మరుపురాని జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి



ఈ కార్యక్రమం ద్వారా నా తోటి మిత్రులను కలుసుకోవడం మరువలేని అనుభూతిని కలిగించింది. వివిధ ప్రభుత్వ కార్యాలయలలో నా తోటి మిత్రులు ఉండడం నిజంగా సంతోషాన్ని కలిగిస్తుంది. ఎన్నో ఏళ్ల మరుపు రాని జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయి.

- పాము శ్రీకాంత్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మద్దూరు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కామిడీ జీవన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి, మండల అధ్యక్షుడు కోల సాయిలు, మద్దూరు ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, మండల ప్రధాన కార్యదర్శిలు వూట్ల శ్రీధర్ రెడ్డి, గద్దల మహేందర్, ఉజ్వల గ్రామ సంఘం అధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, సీసీ మహేందర్, వీవోఏ వినోద, మాజీ సర్పంచులు సందిటి లక్ష్మి, ముక్క కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను మభ్యపెడుతున్న ప్రభుత్వం

- తపస్ రాష్ట్ర కార్యదర్శి పబ్బతి శ్రీనాకర్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

ఎన్నికల సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి ఇచ్చిన హామీలను రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సాకుతో నెరవేర్చకపోవడం దారుణమని, ఉద్యోగులను ప్రభుత్వం మభ్యపెడుతుందని తపస్ రాష్ట్ర కార్యదర్శి పబ్బతి శ్రీనాకర్ రెడ్డి అన్నారు. స్థానిక శిశు మందిర్ లో జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన తపస్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ఆలోచించలేదా, అప్పుడు లేనటువంటి ఇబ్బంది హామీలు నెరవేర్చాల్సిన సమయంలో, సాకులతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి మొండి చేయి చూపడం సరికాదని అన్నారు. గత కొంతకాలంగా జేఏసీల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో విజ్ఞాపన పత్రాలు ఇస్తున్నప్పటికీ, రెండు ఏండ్ల క్రితం ఇవ్వాల్సిన రెండు కరువు భత్యాల్లో ఒకటి మాత్రమే ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి పెరిగిన ధరలతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు పడుతున్న ఇబ్బందులు కనిపించడం లేదా అని అన్నారు. ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఉప సంఘం నియమించి సమస్యలను దాటవేయాలని ప్రయత్నిస్తుందని అన్నారు. కమిటీ పేరుతో కాలయాపన చేయడం ఎందుకని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 317 బాధితుల సమస్యల పరిష్కారాన్ని వెంటనే చేపట్టాలని కోరారు. లేకుంటే ఉద్యమ బాటే శరణ్యమని, అందులో భాగంగా ఈనెల 28న మండల తహసీల్దార్ లకు విజ్ఞాపన పత్రాన్ని ఇస్తున్నామని చెప్పారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు రఘు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించడం కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, వారికి ఓటు హక్కు కల్పించడం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. గత రెండు సంవత్సరాల కాలంగా అనేక బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, ఉపాధ్యాయులకు రావలసిన జీపీఎఫ్ బిల్లులు, మెడికల్ బిల్లులు, ఇంకా అనేక రకాల బిల్లులు పెండింగ్ లోనే ఉన్నాయని, వాటిని సత్వరం చెల్లించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలలో మౌలిక వసతులను కల్పించడం పై ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకుని, విద్యారంగా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పరశురాములు వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు దేవదాసు, బుచ్చిరెడ్డి, జైపాల్ యాదవ్, వెంకటరామిరెడ్డి, విద్యాసాగర్, రమేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ చట్టం 2013 ప్రకారం పునరావాసం కల్పించాలి


- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవ తెలంగాణ- గజ్వేల్

మల్లన్న సాగర్ నిర్వాసితులకు భూసేకరణ చట్టం 2013 ప్రకారం నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం అర్అండ్ కాలనీ వేములఘాట్ కాలనిలో నిర్వాసితులను కలిసి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికి 1636 కుటుంబాలకు పైగా ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చెసినప్పటికి ప్లాట్‌లు చూపలేదన్నారు. అన్ని కుటుంబాలకు అర్అండ్ ప్యాకెజి చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఇండ్లు ఖాళీ చెయించినప్పుడు నిర్వాసితులకు రూ.50 వేల రవాణ ఖర్చులను దళారులు కొట్టెసిన వ్యవహారం పై విచారణ జరిపి, తిరిగి నిర్వాసితులకు అందించాలన్నారు. మల్లన్న సాగర్ గ్రామాల్లో గతంలో నాలుగు, ఇప్పుడు కేవలం ఒక్క హై స్కూల్ ఉంది. పూర్వం గ్రామాల్లో బడి, గుడి, అంగన్ వాడి కేంద్రాలు, గ్రామ పంచాయతి భవనాలు గతంలో ఉన్నట్టు నిర్మించాలన్నారు. నిర్వాసితులకు గ్రామీణ ఉపాధి హామీ పనులు, వారు మరణిస్తే స్మశాన స్థలం ఏర్పాటు చేయాలన్నారు. కాంగ్రెస్ నిర్వాసితులకు అర్అండ్ ప్యాకేజీ అందించడం పై చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు శ్రీనువాస్ రెడ్డి, నరసింహ రెడ్డి ఉపేందర్,శీను డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నంగునూరు

అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు రేకులపల్లి రాజిరెడ్డి కుటుంబానికి పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం అందించారు. మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రేకులపల్లి రాజురెడ్డి సిద్దిపేట అర్బన్ మండలంలోని కృష్ణసాగర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సెకండరీ ఎస్జీటీగా పని చేస్తూ అనారోగ్యంతో చనిపోయారు. రాజురెడ్డి పీఆర్టీయూ టీఎస్‌లో క్రియాశీల సభ్యత్వం(యాక్టివ్ మెంబర్షిప్) తీసుకున్నారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర శాఖ ఉపాధ్యాయ సంక్షేమ నిధి నుంచి రూ. లక్ష మంజూరు చేసింది. ఈ డబ్బులకు సంబంధించిన చెక్కును పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, అదరాసుపల్లి శశిధర శర్మ, పీఆర్టీయూ టీఎస్ ఎంఎల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డిల చేతుల మీదుగా ఆదివారం ఉదయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి, పీఆర్టీయూ టిఎస్ నాయకులు ఎర్ర పార్థసారథి, రామస్వామి, వంగ వెంకట్రామిరెడ్డి, సురేందర్ రెడ్డి, ఒగులం రాజిరెడ్డి, ఎ .జనార్దన్ రెడ్డి, కోరె రాములు, నర్సింహారెడ్డి, యాదగిరి, వంగ శ్రీనివాసరెడ్డి, రామరాజు, ప్రభాకర్ రెడ్డి, రాజిరెడ్డి, రజనీకర్ రెడ్డి, మల్లారెడ్డి, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

- ఉద్యమ కారుల ఫోరం మండలం అధ్యక్షులు అయిలేని సంజివరెడ్డి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

రాష్ట్రంలో అమరులైన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం మండలం అధ్యక్షులు అయిలేని సంజివరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హుస్నాబాద్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిదశ, మలిదశ సాధన పోరాటంలో వందలాది మంది ఉద్యమకారులు బలిదానాలు చేసుకున్నారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే ఎజెండాగా పోరాడుతూ తొలిదశలో పోలీసుల తూటాలకు బలి అయితే, మలిదశలో స్వీయ బలిదానాలు చేసుకొని రాష్ట్ర సాధనకు మార్గాన్ని సుగమం చేశారన్నారు. స్వరాష్ట్రం సాధించుకున్న సంబరాలు కొద్ది రోజుల్లోనే ఆవిరై, కళలు కల్లలుగా మిగిలాయని అన్నారు. గత కెసిఆర్ పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారుల జీవితాల గురించి ఏమాత్రం ఆలోచన చేయలేదన్నారు. వందలాది మంది అమరుల కుటుంబాలను కూడా గుర్తించ నిరాకరించి అవమానించిన పరిస్థితిని మనం చూసామని తెలిపారు. గత ఆరు ఏండ్లకు పైగా తెలంగాణ ఉద్యమకారుల హక్కులను సాధించుకోవడానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పోరాడుతూనే ఉందిని అన్నారు. తెలంగాణ ఉద్యమ కారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్, అంకుశావలి, వలవోజు జగదీశ్వరా చారి, ఎండి అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధి లో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



నవతెలంగాణ-గజ్వేల్

దేశ అభివృద్ధికి, సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుముకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో సెకండరీ గ్రేడ్ టీచర్ యూనియన్ (ఎస్జీటీయు) ప్రాంతీయ కార్యాలయం ను ఆయన ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, అధికారం లోకి రాగానే బదిలీలు , పదోన్నతులు పూర్తి చేసింది అని, డీఎస్సీ ద్వారా 11 వేల ఉపాధ్యాయులను నియామకం చేసిందన్నారు. గురుకులాల్లో నియామకాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ సౌకర్యం, స్కావెంజర్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించి విద్యారంగాన్ని బలోపేతం చేసి ప్రభుత్వం కు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ గడిపల్లి భాస్కర్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర చారి, నాయకులు భిక్షపతి, యూనియన్ నాయకులు శ్రీధర్ రెడ్డి, డీ.శ్రీనివాస్, మంజుల రెడ్డి, సంధ్య, సంగీత, మోహినుద్దిన్, సురేష్, నరసింహ, నరేష్, నాగరాజు, కరుణాకర్, సంతోష్ గోపాల్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెపహాడ్‌లో నూతన మహిళా సమాఖ్య సంఘం ఏర్పాటు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ పల్లెపహాడ్ గ్రామంలో మహిళల భద్రతకు, మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించడానికి పోరాటం సాగించాలని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ పిలుపునిచ్చారు. ఆదివారం మల్లన్న సాగర్ కాలనీలో నిర్వహించిన మహిళలు ఏకమై ఉండి అభివృద్ధి పథం వైపు అడుగులు వేయాలని ఆమె అన్నారు. సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ ఆధ్వర్యంలో నూతన మహిళా సమైక్య సంఘం ఏర్పాటు చేశారు. ఈ సంఘంలో అధ్యక్షురాలుగా శివలింగు లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా గూడూరి యాదవ్, సహాయ కార్యదర్శిగా మడుగూరి లావణ్యను ఎన్నుకోవడం ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు స్వరం రాజేశం, కొండకింది పోచయ్య, కొండి రాజం, రుద్రారం బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షునిగా రాజు



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు గా టి. రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాదులోని మాసాపేట్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అర్చరి అసోసియేషన్కు అనేక సేవలందించినందుకు గుర్తింపుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతేకాకుండా 40 ఏండ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లా వాలిబాల్ అసోసియేషన్కు అనేక సేవలందించిన రాజుకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. అంతేకాకుండా గజ్వేల్ పట్టణంలో జాతీయ వాలీబాల్ క్రీడలను నిర్వహించి అనేక మంది క్రీడాకారులకు స్పోర్ట్ కోటలో విద్యా ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఈ క్రీడలు ఎంతో దోహతపడ్డాయి. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రానున్న కాలంలో ఆర్చరీ క్రీడలకు మంచి గుర్తింపు తీసుకొస్తానని చెప్పారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్ఎస్



నవతెలంగాణ-రాయపోల్

బీఆర్ఎస్ కార్యకర్తలకు వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజిరెడ్డి అన్నారు. ఆదివారం రాయపోల్ మండలం ఎల్కల్ మాజీ ఉప సర్పంచ్ పిట్ల స్వామి వాళ్ళ తండ్రి పిట్ల నర్సింలు మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్కల్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పిట్ల స్వామి తండ్రి నరసిమ్ములు మృతి చెందడం చాలా బాధాకరం. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. రైల్వే బోర్డ్ మాజీ సభ్యులు లక్ష్మారెడ్డి, నాయకులు కుమార్, మల్లేశం, గణేష్ తదితరులు పాల్గొన్నారు

ఒక డీఏ ప్రకటనతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి

- టీఎస్‌యుటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎస్కే వలీ అహమ్మద్, టీ.యాదగిరి

నవతెలంగాణ-సిద్దిపేట

ఒక డీఏ ప్రకటనతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని టీఎస్‌యుటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎస్కే వలీ అహమ్మద్, టీ.యాదగిరిలు అన్నారు. ఆదివారం పట్టణంలో వారు మాట్లాడుతూ ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్ లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదాని మాత్రమే విడుదల చేయడం విచారకరమని అన్నారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏ విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారని, తీరా చూస్తే ఒక డీఏ విడుదల చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. ప్రభుత్వం పునర్ ఆలోచన చేసి మిగతా డీఏలను విడుదల చేయాలని కోరారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

విద్యుద్ఘాతంతో పాడి గేదె మృత్యువాత



నవతెలంగాణ-చేర్యాల

విద్యుద్ఘాతానికి గురై పాడి గేదె మృత్యువాత పడ్డ సంఘటన మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఏష బోయిన సంజీవులు కు చెందిన పాడి గేదె ఆదివారం ఉదయం గ్రామ శివారు కెనాల్ కాలువ పక్కన బైకని మల్లయ్య వ్యవసాయ బావి పరిధిలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్ద మేత మేస్తున్న క్రమంలో విద్యుద్ఘాతానికి గురైంది. గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని రైతు తెలిపాడు. ఆర్థిక సాయం అందించి తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

యువజన సంఘం అధ్యక్షునిగా నరేష్



నవతెలంగాణ-దుబ్బాక

పద్మశాలి సమాజం యువజన సంఘం నూతన అధ్యక్షునిగా చేగూరి నరేష్ ఎన్నికయ్యారు. ఆదివారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో సమాజం అధ్యక్షులు జిందం గాలయ్య, గౌరవాధ్యక్షులు కొండ వెంకట నర్సయ్య ఆధ్వర్యంలో యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అధ్యక్షులు గాలయ్య తెలిపారు. ఉపాధ్యక్షులుగా కూరపాటి. ఆనంద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా రాపెల్లి. రాజు, సంయుక్త కార్యదర్శిగా అవధూత. భాను ప్రకాష్, కోశాధికారిగా చిలుక శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ కార్యవర్గ సభ్యులను చేనేత వస్త్రాలతో సన్మానించడం జరిగింది. ఈ ఎన్నికల కార్యక్రమంలో పద్మశాలి సమాజం కార్యవర్గం, పలు పాండీల పెద్దలు, యువజన సంఘం మాజీ కార్యవర్గం, మాజీ అధ్యక్షులు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపికైన లింగ వైష్ణవి



నవతెలంగాణ-మర్కుక్

జిల్లాస్థాయిలో ఇటీవల నిర్వహించిన జాతీయ సైన్స్ సెమినార్ 2024 పోటీలో పాల్గొన్న మర్కుక్ మండలంలోని దామరకుంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి లింగ వైష్ణవి అత్యుత్తమ సెమినార్ ప్రదర్శన చేసి ,రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యింది. పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం, మండల విద్యాధికారి వెంకట రాములు, సీనియర్ ఉపాధ్యాయులు బాల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థి తల్లిదండ్రులు రామచంద్రం జ్యోతి, ఆదివారం అష్ట స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక కావడానికి గైడ్ చేసిన వై. చిన్న బ్రహ్మయ్య భౌతిక శాస్త్రం, విద్యార్థిని లింగా వైష్ణవిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా అత్యుత్తమ ప్రదర్శన చేసి జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

విద్యాభివృద్ధికి కేంద్రం కృషి



- మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు

నవతెలంగాణ-గజ్వేల్

విద్యాభివృద్ధికి అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేయూత ఇస్తున్నారని మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో రూ.10 లక్షలతో అదనపు గదులకు ఆయన పనులు ప్రారంభించారు. అంతేకాకుండా కంప్యూటర్ గదిని ఆయన పరిశీలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భాగస్వామ్యం తోనే అభివృద్ధి జరుగుతుందని ఆయన చెప్పారు. అంతే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి మెరుగుపడుతూనే ఆయా సామాజిక వర్గాలు ఆర్థిక బలోపేతం అవుతారని ఆయన అన్నారు. ప్రజలకు కూడా కాంగ్రెస్, బీ ఆర్ ఎస్ వేరు తప్ప లోపల కౌల పిల్లలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి పాల్గొన్నారు.

ఘనంగా వంశీధర్ రావు పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట

బీఆర్ఎస్ నాయకులు, మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇంచార్జి వంశీధర్ రావు పుట్టినరోజు వేడుకలు పట్టణంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా వంశీధర్ రావు రక్తదానం చేశారు. ఆయన అభిమానులు, శ్రేయోభిలాషిలు కేకలు కట్ చేయించి, ఘనంగా సన్మానించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ



నవతెలంగాణ-రాయపోల్

బీజేపీ రాయపోల్ మండల అధ్యక్షులు రాజాగారి రాజా గౌడ్ మేనకోడలు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు హిందూ-నవీన్ గౌడ్‌లను మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మెన్ పాల రవీందర్ గౌడ్, రాయపోల్ మాజీ అధ్యక్షులు మాదాసు వెంకట్ గౌడ్, మంకిడి స్వామి, గజ్వేల్ రామచంద్రం, నాయకులు నీల స్వామి, రవీందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నరేష్ గౌడ్, నమసాని స్వామి, ఉదయపూర్ నర్సింలు, రామ్ సాగర్ వెంకట్ గౌడ్, మల్లేశం, బాలరాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలలో డీఎంఎఫ్టీ అమలు ఎప్పుడో..?

- ఎదురుచూస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ పాఠశాలలో డీఎంఎఫ్టీ అమలు ఎప్పుడూ నోచుకుంటుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. ఆగస్టు నుండే ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇప్పటికీ మూడు నెలలు కావస్తున్న ఈ పథకం అమలు కావడం లేదు. పారిశుద్ధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు కేటాయించి ఆ పాఠశాలలో పరిశుభ్రత, ఇతర కార్యక్రమాలకు బలోపేతం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్యచరణ ప్రారంభించినప్పటికీ అది జీవోతోనే నిలిచిపోయినట్లు కనిపిస్తుంది. పాఠశాలలో చాలాచోట్ల అటెండర్లు, వాచ్మెన్లు లేకపోవడంతో గదులను శుభ్రం చేయడం, మరుగుదొడ్లను, మూత్రశాలలను కడగడం లాంటి విషయాలకు సిబ్బంది కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

సిద్దిపేట జిల్లాలో...

జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చాలా చోట్ల వాచ్మెన్లు, అటెండర్లు లేకపోవడంతో కొన్నిచోట్ల ఉదయమే వచ్చిన విద్యార్థిని విద్యార్థులు తమ తరగతి గదులను శుభ్రం చేసుకోవడం కనిపిస్తుంది. ఆ విషయాలను బయటకు రాకుండా ఉపాధ్యాయులు జాగ్రత్త పడుతున్నారు. అంతేకాకుండా పాఠశాలలో మొక్కలు పెంపకం వాటి సంరక్షణ సైతం విద్యార్థులు చూస్తున్నారు. చదువుతోపాటు ఇతర కార్యక్రమాలకు చేయూత ఇస్తున్నారు. కొన్నిచోట్ల గ్రామపంచాయతీ కార్మికులతో పాఠశాల గదులను, ఆవరణంను శుభ్రం చేయిస్తున్నారు. పాఠశాలకు సంబంధించిన సిబ్బంది లేకపోవడంతో గ్రామపంచాయతీ కార్మికులను సర్పంచ్ల అనుమతితో పనులకు వాడుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి జిల్లాకు డీఎంఎఫ్టీలను ఏర్పాటు చేసింది. దీనికి జిల్లా కలెక్టర్ చైర్మెన్‌గా దీన్ని డిస్టిక్ మినరల్ ఫండే ట్రస్ట్ ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించిన జీవో21ని జులై 30న ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు మొదటి వారం నుంచి అమలు చేయాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ఆ దశగా అడుగులు వేయడం లేదు. ఈ నిధుల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి ఏర్పాటు చేసి ఈ నిధులను విడుదల చేయాలని లక్ష్యం పెట్టుకున్నప్పటికీ అది నీరుకారి పోయినట్లు కనిపిస్తుంది. ఈ ట్రస్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి మూడు తరగతి వరకు రూ.3 వేలు, 100మంది ఉన్న పాఠశాలకు రూ.6 వేలు, 100 నుంచి 250 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు రూ.8 వేలు, 250 నుంచి 500 వరకు పాఠశాలకు రూ.12 వేలు, 501 నుంచి 750 వరకు పాఠశాలకు రూ 15. వేలు, 750కి పైగా పాఠశాలకు రూ.20 వేలు కేటాయిస్తుందని జీవోలో పేర్కొన్నది. అయితే దీనిని స్కూల్ ఫ్లెస్మెంట్ మెయింటెనెన్స్ గ్రాంట్ అని కూడా అంటారు.

జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు.

ప్రాథమిక పాఠశాలలు-638, ప్రాథమిక ఉన్నత-114, జడ్పీహెచ్ఎస్-228, కేజీబీవీలు-63, ఆదర్శ-14 పాఠశాలలున్నాయి. అదేవిధంగా మైనార్టీ గురుకులాలు-6, బీసీ-13, ఎస్టీ-1 ఉన్నాయి. ఇందులో భాగంగా కళాశాలలు వైద్య కళాశాల-1, డిగ్రీ-7, జూనియర్-20 వరకు ఉన్నాయి. మొత్తం పాఠశాలలు సిద్దిపేట జిల్లా లో 1,105 ప్రభుత్వ పాఠశాలలు, కళశాలలు ఉన్నాయి. ఇందులో 1.50 లక్షల మంది విద్యార్థులు విద్యాబోధన చేస్తున్నారు. ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తే విద్యార్థులకు కొంత మేలు జరుగుతుండగా ప్రభుత్వ పాఠశాలలో సిబ్బంది కొరత సైతం పారిశుద్ధ్య కార్మికులకు ఉపాధి కలిగే అవకాశం ఉంటుంది. ఈ నిధుల ద్వారా కలెక్టర్ ఆదేశాల మేరకు కొందరికి ఉపాధి కల్పించేందుకు వీలుంటుంది. జిల్లా ఉన్నత అధికారులు ఈ పథకాన్ని ఎందుకు అమలు చేయడం తెలియటం లేదు. నిధుల కొరత ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాల కోసం అనేది తెలియవలసింది. ప్రభుత్వం వెంటనే పథకాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జీవో 317 సమస్యలపై దాటవేత వైఖరికి నిరసన

- పెండింగ్‌లో ఉన్న 5 డీఎలను ప్రకటించాలి
- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

ఐదు వాయిదాల కరువు భత్యం(డీఎ)లు పెండింగ్ లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదాని మాత్రమే విడుదల చేయడం, జీఓ 317 సమస్యలపై దాటవేత వైఖరిపట్ల ఉపాధ్యాయులమంతా తీవ్రంగా నిరసిస్తున్నామని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో సిద్దిపేట జిల్లా జనరల్ కౌన్సిల్ కు ముఖ్య అతిథులుగా హాజరై ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏలు విడుదల చేస్తామని, పీఆర్సీ రిపోర్ట్ తెప్పించి వెంటనే ఆమోదయోగ్యమైన ఫిట్మెంట్ తో పిఆర్సీ ప్రకటిస్తామని, పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని, జీఓ 317 బాధితులందరికీ న్యాయం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని గత పదినెలలుగా ప్రభుత్వంపై వత్తిడి చేయకుండా ఓపిక పట్టామని, సగం మందికైనా నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తున్నందుకు సంతోషించామని, జీఓ 317 సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించినందున సమస్యలన్నీ సానుకూలంగా పరిష్కరిస్తారని ఆశించినవారికి కమిటీ సిఫార్సులు తీవ్ర నిరాశను కలిగించాయని అన్నారు. సీపీఎస్ రద్దు గురించి ఊసే లేదని, రెండేళ్ళుగా వేలాది బిల్లులు క్లియర్ కావటం లేదని, వినిమయ ధరల సూచీకి అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించబడుతుందని, గత కొన్నేళ్ళుగా రాష్ట్రంలో ఈ ఆనవాయితీని పాటించటం లేదన్నారు. ఇవ్వాల్సిన సమయంలో ఇవ్వకుండా పండుగలప్పుడు కానుకలుగా ఇస్తున్నట్లు ప్రకటించటం విడ్డూరంగా ఉందని, గత ప్రభుత్వం మూడు వాయిదాలు బకాయి పడితే ఈ ప్రభుత్వం వచ్చాక మరో రెండు వాయిదాలు వచ్చి చేరాయి. కనీసం రెండు వాయిదాల డిఏ అయినా ఇప్పుడు ఇస్తారని ఉద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్న సందర్భంలో కేవలం ఒక్క వాయిదా డీఏ మాత్రమే విడుదల చేయటంతో ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వం పెట్టే ఖర్చులన్నీ పెడుతూనే ఉద్యోగులకు న్యాయంగా ఇవ్వాల్సిన డిఎలకే ఆర్థిక పరిస్థితి ఆటంకమౌతుందా అని టీపీటీఎఫ్ ప్రశ్నిస్తుందని అన్నారు. డీఏ తోపాటు జీఓ 317 సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పున్ణ సమీక్షించుకోవాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి సమస్యలన్నింటినీ కాలయాపన లేకుండా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విజయేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్ కనకయ్య, మాడుగుల రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి కే తిరుపతి, రాష్ట్ర సీనియర్ నాయకులు జీ.తిరుపతిరెడ్డి, పొన్నమల రాములు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడం సిగ్గుచేటు

- ఎస్ఎఫ్ఐ సిద్దిపేట డివిజన్ అధ్యక్షులు చేప్యాల సంతోష్, జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్



నవతెలంగాణ-సిద్దిపేట

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, విద్యార్థులకు అండగా ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇవ్వాలని వస్తే బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట డివిజన్ అధ్యక్షుడు చేప్యాల సంతోష్, జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్‌లు అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతి పత్రం ఇవ్వడానికి క్యాంప్ కార్యాలయం వెళ్లగా, బీఆర్ఎస్ కార్యకర్తలు ఆడుకోవడంతో గేటు ముందే కొంతసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పది నెలలు గడుస్తున్నా స్కాలర్షిప్ష, ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కళాశాల యాజమానులు ఇబ్బంది గురి చేస్తూ ముందుగానే డబ్బులు వసూలు చేస్తున్నారని, డబ్బులు లేని విద్యార్థుల దగ్గర సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బంది గురి చేస్తున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్కాలర్షిప్ష, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులను అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని అన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటాలు ఆడితే ఊరుకునే ప్రసక్తి లేదని, బకాయిలను విడుదల చేయకపోతే ఎమ్మెల్యే, మంత్రిని రోడ్లపై స్వేచ్ఛగా తిరగనియ్యము హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను, నాయకులు సారుకు హర్షవర్ధన్, నవదీప్, జస్వంత్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించడం బాధాకరం

- మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ



నవతెలంగాణ-చేర్యాల

ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించడం చాలా బాధాకరమని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ అన్నారు. మాల మహానాడు 18 వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని అంగడి బజారులో జెండాను ఎగురవేసి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలు తక్కువ, మాదిగలు ఎక్కువగా ఉన్నారని చూపించడం సరైంది కాదన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా ఇప్పుడు 2024 లెక్కల ప్రకారం జనాభా లెక్కలు తీయాలని కోరారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత మాల మాదిగలలో ఎంతమందికి మూడు ఎకరాల భూమి, డబల్ బెడ్ రూమ్, దళిత బంధు, సబ్సిడీ లోన్స్ ఇచ్చారో, వార్డు మెంబర్ నుంచి ఎమ్మెల్యే వరకు మాల, మాదిగలు ఎవరు ఎంత మంది ఉన్నారో లెక్కలు తీయాల్సిన అవసరం ఉందన్నారు. మాలలు, మాల ఉపకులాల జనాభా ఎంత, మాదిగలు, మాదిగ ఉపకులాల జనాభా లెక్కలు తీయాలని ఇవి ఏం చేయకుండా వర్గీకరణ చేస్తే మాలలు ఊరుకుండే ప్రసక్తేలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుస్కు రామదాస్, బుట్టి ఆగమల్లు, పుట్ట యాదయ్య, చేర్యాల పట్టణ అధ్యక్షులు పుట్టరాజు, పుట్ట మల్లికార్జున్, కాటం శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు చింతల విజయ్ కుమార్, నియోజకవర్గ ఇంచార్జి శ్రీరామ్ వెంకటేష్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చంద్ర శ్రీకాంత్, యూత్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీరామ్ వెంకటేష్, చేర్యాల మండల కన్వీనర్ గుస్కు గోవర్ధన్, మద్దూరు కనకయ్య, యనమల యాదమ్మ, కమలాపురం వీరమణి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం



నవతెలంగాణ-మర్కుక్

మత్స్యకారులు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్న మత్స్యకారులకు చేపలు పంపిణీ చేయడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మత్స్యకారులకు ముఖ్యంగా ముదిరాజులకు పెద్దపీట వేసి, ప్రతి ఏడాది వర్షాలు పడగానే చేప పిల్లల పంపిణీ చేశారని, అదేవిధంగా సబ్సిడీ కింద ద్విచక్ర వాహనాలు, చేపల రవాణా కోసం ఫోర్ వీలర్స్ ఆటోలు, మత్స్యకార మహిళలకు చేపల ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కోసం మొబైల్ క్యాంటీన్ వాహనాలు, అనేక సంక్షేమ పథకాలను అందించారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మత్స్యకారుల పైన, ముదిరాజుల పైన సవితి తల్లి ప్రేమను చూపిస్తూ, పైసా కూడా కేటాయించడం లేదని, నేటికి కూడా ఉచిత చేప పిల్లలు ఇవ్వకుంటే మత్స్యకారుల జీవనోపాధి ఎలా గడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు బాలకిషన్ ,తదితరులున్నారు.

జూనియర్ కళాశాలకు ఫర్నిచర్ అందజేత



నవతెలంగాణ-రాయపోల్

దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల ఒకేషనల్ కోర్స్ కంప్యూటర్ సైన్స్ కనీసం వసతులను దృష్టిలో ఉంచుకొని, పూర్తిగా శిథిలావస్థకు చేరిన కంప్యూటర్ ఫర్నిచర్‌ను అందించడానికి సీయోరా డెవలపర్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ హబ్సిగూడ సహృదయంతో ముందుకు రావడం అభినందనీయమని కళాశాల ప్రధానోపాధ్యాయులు మధు శ్రీవాత్సవ అన్నారు. ఆదివారం కళాశాలకు కంప్యూటర్ ఫర్నిచర్ కోసం రూ.15 వేల నగదును సీయోర బ్రాంచ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆల శివారెడ్డి , ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీణారెడ్డి కళాశాలకు అందించారు. ఈ దాతృత్వ హృదయా నికి కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాత్సవ, అధ్యాపక సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే పేద విద్యార్థిని విద్యార్థులకు ఈ సామాజిక వితరణ మరికొన్ని సంస్థలకి సియోరా గ్రూప్ హబ్సిగూడ ఆదర్శమని అధ్యాపక సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

బాలన్న మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు





నవతెలంగాణ-మిరుదొడ్డి

దళిత బహుజన ఉద్యమంలో పనిచేసిన నాయకుడు అంగడి అందే బాలన్న మరణం తీరనిలోటని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన కామ్రేడ్ అంగడి బాలన్న అందే బాలన్న ఈనెల 20వ తేదిన అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరం అన్నారు. బాలన్న చేసిన సేవలు 40 ఏండ్లు ప్రజల ఉద్యమంలో దళిత బహుజన ఉద్యమంలో జనశక్తి పార్టీ మిలిటెంట్ పోరాటంలో దళిత మరియు మానవ హక్కుల సామాజిక హక్కుల కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేయడం జరిగిందని తెలిపారు. నేడు అందె ఎస్సీ కమ్యూనిటీ హాల్లో మధ్యాహ్నం రెండు గంటలకు కామ్రేడ్ బాలన్న సహచరులు బంధుమిత్రుల ఆధ్వర్యంలో సంస్మరణ సభ ఉన్నది దీనికిగాను ముఖ్యఅతిథిగా అరుణోదయ విమలక్క , ఏపూరి సోమన్న , మాస్టార్జీ , డాక్టర్ దరువు ఎల్లన్న అంజన్న ఇంకా చాలామంది కవులు గాయకులు నాయకులు రాబోతున్నారు .కాబట్టి బాలన్నతో పనిచేసిన సహచరులు వచ్చి ఈ యొక్క కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన

మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన ప్రజా ఉద్యమకారుడు కళాకారుడు అందె భాస్కర్ తండ్రి కామ్రేడ్ అందె బాలయ్య ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని ఆదివారం ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ వారి స్వగ్రామం అందెలో కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కామ్రేడ్ బాలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుల్తాన మాట్లాడుతూ కామ్రేడ్ బాలయ్య మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అన్నారు. బాలయ్య మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం దళిత బహుజన మధు బొంపల్లి ఎద్దు నరేందర్ తో పటు పలువురు బాలన్న కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాయపోలు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు, జర్నలిస్ట్, మన్నె గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు



నవతెలంగాణ-మద్దూరు

హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సదర్ సమ్మేళనంలో జనగామ జిల్లా నుంచి భారీగా బయలుదేరిన యాదవ సంఘం నాయకులు వివిధ కుల సంఘాల నాయకులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బానుక శివరాజ్ యాదవ్‌జనగామ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్, యాదవ సంఘం కుల పెద్దలు బనుక సిద్దిరాజ్ యాదవ్, కనుగంటి ముత్తయ్య యాదవ్, మారబోయిన సమ్మయ్య, తాటికొండ వెంకటేష్ యాదవ్, ప్రశాంత్ యాదవ్, శేఖర్ యాదవ్, బాలరాజు యాదవ్, అనిల్ యాదవ్, సాగర్ గౌడ్, సతిరెడ్డి, రమేష్, శ్రీనివాస్ యాదవ్, అందె నాని సుర సంపత్ తదితరులు తరలి వెళ్లారు


ఐనాపూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-కొమురవెల్లి

మండలంలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 22 ఏండ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా తాము పాఠశాలలో చదువుకున్నప్పటి జ్ఞాపకాలను, చిలిపిపనులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహ్మారెడ్డి, నాగభుషణం, శ్రీరాములు, నర్సింహులు, ఆనంద్, నారాయణరెడ్డి, జనార్ధన్ రెడ్డి, పూర్వ విద్యార్థులు నాగమల్ల సత్యనారాయణ, సంపత్ రెడ్డి, జిల్లా వెంకట్నారాయణ, అశోక్, ప్రవీణ్, కవిత, సంతోషి, మంజుల, రేఖ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-వర్గల్

గజ్వేల్ ప్రభుత్వ పాఠశాల 1983- 84 ఏడాది 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గౌరారంలోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. చిన్ననాడు చదువుకున్న మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ ఆత్మీయంగా ఆనందంగా గత నాలుగు దశాబ్దాల క్రితం ఒకచోట చదువుకున్న అందరం ఒకచోట కలవడం సంతోషంగా ఉందని భావోద్వేగానికి గురై సంతోషం వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రతి ఏడాది అందరం ఒకచోట కలుసుకొని కష్టసుఖాలు పాలు పంచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు నేతి శ్రీనివాస్, అంబదాస్, తోట బిక్షపతి, గందే రమేష్, ఎస్ సీ శ్రీనివాస్, గంగిశెట్టి సుధాకర్, జే శ్రీనివాస్, వెంకట రమణ, పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు